నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 24-11-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి:33 సంచిక:100 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం-నేటికి అందం

తెలివిగ యోచన జేయగ
విలువగు ప్రాణములు గాచు విజ్ఞత మెరయన్
తెలగాణపు విద్యార్థులు
హిలిహిలముగ నిడిరి "స్మార్టు హెల్మెటు"ను మొగిన్!!

(రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలను కాపాడడం కోసం తెలంగాణా విద్యార్థులు తమ తెలివి తేటలతో " స్మార్ట్ హెల్మెట్ "ను కనుగొనడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది)

-రాధశ్రీ
సెల్:9494481210



చురక

ఆంధ్ర నీటి ప్రాజెక్టుల
ఆరంభం నాడప్పుడు
గతంలోని ప్రభుత్వం
గొంతు విప్పలేదెప్పుడు.
నాడు జగన్ కేసీఆర్ ల
నిండు ప్రేమ స్నేహం
తెలంగాణ నీటి వాటా
తన్నుకెళ్లే ద్రోహం.

-వేల్పుల నారాయణ
9440433475



నీళ్ల విషయంలో దొంగే దొంగ అన్నట్లుంది బీఆర్ఎస్ తీరు: భట్టి విక్రమార్క



హైదరాబాద్, నవంబర్ 23: గాంధీ భవన్ లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ బీఎం సందీప్ కుమార్‌తో మంత్రులు వరుసగా భేటీ అవుతున్నారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్‌తో భేటీ అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఆర్గనైజేషన్ బలోపేతంపై ఇన్‌ఛార్జ్‌తో చర్చించామన్నారు. పార్టీలో విభేదాలు లేవని.. విబేధాలు లేనప్పుడు చర్చ ఎందుకు జరుగుతుందని ప్రశ్నించారు. నీళ్ల విషయంలో దొంగే దొంగ అన్నట్లుంది బీఆర్ఎస్ తీరు అంటూ మండిపడ్డారు.

తెలంగాణ నీటి వాట కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పోరాటం చేస్తోందని భట్టి తెలిపారు. బీఆర్ఎస్ తప్పులను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. కేటీఆర్ ఊహా ప్రపంచంలో బతుకుతున్నారని.. సోషల్ మీడియా లోకంలో ఉన్నారంటూ ఎద్దేవా చేశారు. 'ప్రభుత్వ వ్యవస్థలను బీఆర్ఎస్ కుప్పకూల్చింది.. దాన్ని సరిదిద్దుతుంటే మాపై ఆరోపణలా?' అంటూ ఫైర్ అయ్యారు.

పేద కుటుంబాన్ని వెతికి మరీ సంక్షేమం అందిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్‌కు అధికారం అనేది ఇక కలే అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు.

బండి..గ్రౌండ్ సక్సెస్

రోజుల్లోనే మహా పాదయాత్రను సూపర్ హిట్ చేసినవ్ మర్చిపోలేని అనుభూతి కలిగింది
సంతోషంతో బండి సంజయ్ ను ఆలింగనం చేసుకున్న బీజేపీ చీఫ్ నితిన్ నబిన్



కరీంనగర్, నవంబర్ 23: (నేటినిజం ప్రతినిధి) కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈరోజు కరీంనగర్ లో నిర్వహించిన 'మహా పాదయాత్ర' ఊహించని రీతిలో విజయవంతం కావడంతో బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ సంతోషం వ్యక్తం చేశారు. మహా పాదయాత్ర అనంతరం కరీంనగర్ ఆర్ అండ్ బి గెస్ట్ హౌజ్ కు వెళ్లి కాసేపు సేద తీరిన నితిన్ నబిన్ సాయంత్రం 4.45 గంటలకు కరీంనగర్ కలెక్టరేట్ హెలిప్యాడ్ వద్దకు వచ్చారు.

హైదరాబాద్ మీదుగా ఢిల్లీకి తిరుగు పయనమయ్యారు. హెలికాప్టర్ ఎక్కే ముందు ఆనందంతో నితిన్ నబిన్ బండి సంజయ్ చేయి పట్టుకుని 'బండి జీ.... 'మహా పాదయాత్ర' గ్రాండ్ సక్సెస్ చేసినవ్. 3 రోజుల ముందే షెడ్యూల్ ఫిక్స్ చేసినప్పటికీ ఇంత పెద్దగా సక్సెస్ చేసినవ్. తక్కువ టైంలోనే చాలా చాలా బాగా ప్లాన్ చేసినవ్. మర్చిపోలేని అనుభూతి కలిగింది. మీ కష్టపడే పనితనం నాకు తెలుసు. కరీంనగర్ రావాలని మొదటి నుండి నా మనసులో ఉండేది. అందుకే వచ్చిన. ప్రజా స్పందన బ్రహ్మాండంగా ఉంది. నేనెక్కడా చూడని విధంగా కరీంనగర్ కార్యకర్తల్లో విపరీతమైన జోష్ కన్పించింది. ఆనందంతో వెళుతున్నా"అని పేర్కొంటూ బండి సంజయ్ ను ఆనందంతో ఆలింగనం చేసుకున్నారు. బీజేపీ సీనియర్ నాయకులు, పార్టీ పరిశీలకులు సైతం 'మహా పాదయాత్ర'కు వచ్చిన కార్యకర్తలు, జనాన్ని చూసి ఆశ్చర్యపోయారు. ఇంత పెద్ద సంఖ్యలో తరలి వస్తారని ఊహించలేదని, దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు జరిగిన మహా పాదయాత్రల్లో ఇదే 'టాప్' అని పేర్కొనడం గమనార్హం.

'సర్'పై అబద్ధాలు చెబుతున్నారు.. నితిన్ నబీన్ ధ్వజం

కరీంనగర్, నవంబరు 23: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సర్' అంశంలో ఆయన అబద్ధాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారని మండిపడ్డారు. ఈరోజు (సోమవారం) కరీంనగర్‌లో నితిన్ నబీన్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో ఓటు చోరీ జరగలేదని స్పష్టం చేశారు. ప్రజలంతా బీజేపీ వైపే ఉన్నారని వ్యాఖ్యానించారు.

3 కోట్ల మంది చనిపోయిన వారి ఓట్లను తొలగొంచొద్దా..? అని నితిన్ నబీన్ ప్రశ్నించారు. 13 కోట్ల ఓట్లు పోయాయని రాహుల్ గాంధీ అబద్ధాలు చెబుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం కోసం కాంగ్రెస్ పార్టీ ఏనాడు ఆలోచించలేదని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధిలో పరుగులు పెడుతోందని ఉద్ఘాటించారు.

ఢిల్లీలో రూపాయి విడుదల చేస్తే అది నేరుగా పేదల ఖాతాలోనే జమ అవుతుందని తెలిపారు. మోదీ నేతృత్వంలోనే బీజేపీ దేశంలో మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మోదీ ప్రధాని అయ్యాక దేశంలో అవినీతి తగ్గిందని నితిన్ నబీన్ పేర్కొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై నితిన్ నబీన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

రాహుల్ గాంధీ, కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలకు ఆయన ఏటీఎంలాగా మారారని విమర్శించారు. తెలంగాణ ప్రజలను దోచి ఢిల్లీ బాసులకు ఖజానాను పంపిస్తున్నారని ఎద్దేవా చేశారు.

తెలంగాణ కంటే ఢిల్లీ బాసుల ఆశీర్వాదం కోసమే రేవంత్‌రెడ్డి ప్రదక్షిణలు చేస్తున్నారని ఆక్షేపించారు. రాష్ట్రంలో ఒక అవినీతి ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించారని విమర్శించారు. అంతకంటే పెద్ద అవినీతి ప్రభుత్వం వస్తుందని ప్రజలకు అప్పుడు తెలియదని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని హెచ్చరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలిస్తామని వార్నింగ్ ఇచ్చారు. తెలంగాణ ప్రజలు రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్పటం ఖాయమని నితిన్ నబీన్ హెచ్చరించారు.

గ్లోబల్ సమ్మిట్‌కు ఫేషియల్ రికగ్నిషన్‌తో ఎంట్రీ..

సమ్మిట్ అతిథులకు ప్రత్యేక ఆతిథ్యం..
అధికారులకు శిక్షణ ఇవ్వాలని సీఎం ఆదేశం!
గ్లోబల్ సమ్మిట్ నిర్వహణలో అలసత్వం వద్దు..
అధికారులకు రేవంత్ రెడ్డి స్పష్టమైన హెచ్చరిక!
ప్రతినిధుల ఆహ్వానాల బాధ్యత ముగ్గురు మంత్రులకు
.. సీఎం రేవంత్ కీలక నిర్ణయం!



హైదరాబాద్, నవంబర్ 23: గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతి అంశంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఏర్పాట్లలో ఏ అధికారి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని స్పష్టం చేశారు. సోమవారం సమ్మిట్ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం పలు కీలక సూచనలు చేశారు.

సమ్మిట్‌కు వచ్చే ప్రతినిధులకు ఫేషియల్ రికగ్నిషన్ విధానం ద్వారా ప్రవేశం కల్పించాలని సీఎం సూచించారు. వారికి అవసరమైన సహకారం అందించేందుకు ప్రత్యేక లైజన్ ఆఫీసర్ల వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతినిధులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా విధుల్లో ఉండే అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. అతిథుల కోసం ప్రత్యేక ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయడంతోపాటు వేగవంతమైన, మెరుగైన ఇంటర్నెట్ నెట్‌వర్క్ నదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు.

సమ్మిట్ వేదికలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా తీర్చిదిద్దాలని సీఎం ఆదేశించారు. నమ్మక్క?సారలమ్మ ఆలయ తోరణాల నమూనాలను స్ఫూర్తిగా తీసుకుని సమ్మిట్ ప్రాంగణంలో అలంకరణలు చేపట్టాలని సూచించారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని దేశ, విదేశీ ప్రతినిధులకు పరిచయం చేసేలా ఏర్పాట్లు ఉండాలన్నారు.

సమ్మిట్‌లో భాగంగా నిర్వహించే ఎయిర్ షోతోపాటు ఇతర కార్యక్రమాలను వీక్షించే అవకాశం ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు కల్పించాలని సీఎం సూచించారు. విద్యార్థులు ఈ కార్యక్రమాలను వీక్షించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే ఎడ్యుకేషన్ పెవిలియన్‌లో దేశ, విదేశాల్లో పేరుపొందిన ప్రముఖ విశ్వవిద్యాలయాలు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ముఖ్యమైన ప్రతినిధులు, ప్రముఖులకు ఆహ్వానాలు పంపే బాధ్యతలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబులకు అప్పగించాలని సీఎం సూచించారు. ఆహ్వానాల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, సమ్మిట్‌కు వచ్చే అతిథులకు అవసరమైన సహకారం అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

ఈ సమీక్ష సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, సీఎం సలహాదారు శివధర్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, నవీన్ మిట్టల్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్‌తోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్ మెట్రోకు కేంద్రం షాక్..

ఐఆర్ఎఫ్‌సీ రుణం సంగతి తెలియదన్న అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, నవంబర్ 23: హైదరాబాద్ మెట్రో ఫేస్-2పై కేంద్రం మాటమార్చింది. హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు ఆర్థిక సహకారం తన పరిధిలోకి రాదని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. మెట్రో రెండోదశకు ఐఆర్ఎఫ్‌సీ (ఎఫీఈఅ) ఇస్తానన్న రుణం సంగతి తనకు తెలియదని తెలిపారు. హైదరాబాద్ మెట్రో ఫేస్-2 రుణాల కోసం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. పలుసార్లు అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి మెమోరాండంలు అందజేసిన విషయం తెలిసిందే.

హైదరాబాద్ మెట్రో రెండోదశకు అనుమతులు, నిధులు ఇవ్వాలంటూ అశ్వినీ వైష్ణవ్‌ను కిషన్ రెడ్డి ప్రత్యేకంగా కలిసి మరీ విజ్ఞప్తి చేశారు. ఐఆర్ఎఫ్‌సీ నిధుల వ్యవహారంలో అశ్వినీ వైష్ణవ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి కలిశారు. అయితే ఈరోజు (సోమవారం) మీడియాతో జరిగిన ఇష్టాగోష్టిలో... హైదరాబాద్ మెట్రో, ఐఆర్ఎఫ్‌సీ ఆర్థిక సహకారం విషయాలేవీ తనకు తెలియదని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు.

వచ్చే ఏడాది మే లో బుల్లెట్ ట్రైన్ ట్రయల్ రన్ జరుగుతుందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. దాదాపు 50 కిలోమీటర్ల దూరంలో ట్రాక్, విద్యుదీకరణ పనులు పూర్తి అయినట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో బులెట్ రైలు కోచ్‌లు అందుబాటులోకి వస్తాయన్నారు. బులెట్ ట్రైన్ 250 కి.మీ వేగంతో నడవనుందన్నారు. అహ్మదాబాద్, ముంబై మధ్య బులెట్ ట్రైన్ కారిడార్ నిర్మాణం వేగంగా జరుగుతోందన్నారు. ఈ కారిడార్‌లో సూరత్, బిలిమోరా సెక్షన్‌లో 50 కిలోమీటర్ల మేర రైలు కారిడార్ పూర్తైనట్లు తెలిపారు. ఇదే వేగంతో అన్ని సెక్షన్‌లలో పనులు వేగంగా పూర్తి చేయనున్నామని చెప్పారు. 2029 నాటికి బులెట్ ట్రైన్ థానే వరకు చేరుతుందని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

కష్టకాలంలో నేపాల్‌కు భారత్ చేయూత.. బంధం మరింత బలోపేతం!

వరద బాధితుల పునర్నిర్మాణానికి రూ.15 వేల కోట్ల సాయం..
ఎనిమిది కీలక ఒప్పందాలు..
మోదీ-బాలేంద్ర షా భేటీతో స్నేహబంధానికి కొత్త బలం



న్యూఢిల్లీ, నవంబర్ 23:కష్టకాలంలో తోడుగా నిలిచేదే నిజమైన స్నేహం.. ఆపదలో ఉన్నప్పుడు అందించే చేయూతే బంధాన్ని మరింత బలపరుస్తుంది. ప్రకృతి ప్రకోపంతో తీవ్రంగా నష్టపోయిన నేపాల్‌కు భారత్ మరోసారి అండగా నిలిచింది. వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనలతో ప్రాణనష్టం, ఆస్తినష్టం సంభవించి.. ఎన్నో కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో ఉన్న సమయంలో పునర్నిర్మాణానికి భారీ ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా (బాలెన్ షా)తో భారత ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం న్యూఢిల్లీలో జరిపిన భేటీలో రూ.15 వేల కోట్ల విలువైన అభివృద్ధి సహకార ప్యాకేజీని ప్రకటించారు. అంతేకాదు.. ఇరు దేశాల మధ్య ఎనిమిది కీలక ఒప్పందాలు కుదిరాయి. రవాణా, ఇంధనం, జలవిద్యుత్, ఆరోగ్యం, సాంకేతికత వంటి రంగాల్లో సహకారానికి కొత్త మార్గాలు తెరుచుకున్నాయి. ఈ పరిణామాలు కేవలం రెండు ప్రభుత్వాల మధ్య దౌత్య చర్చలకే పరిమితం కాకుండా.. రెండు దేశాల ప్రజల మధ్య ఉన్న ఆత్మీయ బంధానికి మరోసారి అద్దం పట్టాయి.

నేపాల్‌లో ఆగస్టు 26న సంభవించిన ప్రకృతి విపత్తు తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. హిమనీనదం కూలిపోవడంతో వచ్చిన వరదలు, బురద ప్రవాహాలు, కొండచరియల కారణంగా గ్రామాలు, ఇళ్లు, రహదారులు, ఇతర మౌలిక నదుపాయాలు ధ్వంసమయ్యాయి. సుమారు 1,500 మంది ప్రాణాలు కోల్పోగా.. 5,200 మందికి పైగా గల్లంతయ్యారు. అనేక కుటుంబాలు తమ ఆత్మీయులను కోల్పోయి విషాదంలో మునిగిపోయాయి. జీవనోపాధి దెబ్బతిని, నివాసాలు కోల్పోయిన ప్రజలకు తిరిగి సాధారణ జీవితం ప్రారంభించడం పెద్ద సవాలుగా మారింది.

ఇలాంటి క్లిష్ట సమయంలో నేపాల్ పునర్నిర్మాణానికి భారత్ భారీ ఆర్థిక సహాయాన్ని ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. నేపాల్ కరెన్సీలో 24 వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి సహకార ప్యాకేజీని అందించనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. భారత కరెన్సీలో దీని విలువ సుమారు రూ.15 వేల కోట్లు. బాధిత కుటుంబాలు తిరిగి తమ జీవితాలను గాడిలో పెట్టుకోవడం, కొత్త అవకాశాలు కల్పించడం, భవిష్యత్తులో ఇలాంటి విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచడం ఈ సహాయ ప్యాకేజీ ప్రధాన లక్ష్యాలు.

భారత్, నేపాల్ సంబంధాల గురించి మోదీ చేసిన వ్యాఖ్యలు ఈ భేటీలో ప్రత్యేకంగా నిలిచాయి. ఇరు దేశాలు కేవలం పొరుగు దేశాలు మాత్రమే కాదని.. పరస్పర విశ్వాసం, స్నేహంతో ముడిపడిన భాగస్వాములని పేర్కొన్నారు. తమ సంతోషాలు, సవాళ్లు ఉమ్మడివని.. అభివృద్ధి ప్రయాణంలో ఒకరికొకరు తోడుగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు. నేపాల్ పరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ ఏడాది చమురు సరఫరాలో తీవ్ర సవాళ్లు ఎదురైనప్పటికీ నేపాల్‌కు ఇంధనం, ఎరువులు, ఇతర నిత్యావసర వస్తువుల సరఫరాను కొనసాగించినట్లు మోదీ గుర్తుచేశారు. పొరుగు దేశాలకు ప్రాధాన్యమిచ్చే విధానంలో భాగంగా నేపాల్‌కు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలి : కలెక్టర్ అంకిత్



ఖమ్మం, నవంబర్ 23: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేలా నాణ్యమైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ అంకిత్ సూచించారు. సోమవారం బూర్గంపహాడ్ మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి బోధనా తీరును పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న బోధనా విధానం, విద్యార్థుల అభ్యసన సామర్థ్యం, డిజిటల్ విద్యావనరుల వినియోగం, ఉపాధ్యాయుల బోధన తీరును కలెక్టర్ పరిశీలించారు. తరగతి గదులను సందర్శించిన ఆయన విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాలపై వారి అవగాహనను పరీక్షించారు. పాఠ్యాంశాల్లో ప్రశ్నలు అడుగుతూ సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయులు మైండ్ మ్యాపింగ్ విధానంతో పాఠ్యాంశాలను బోధించడం, ప్రధాన అంశాలను విద్యార్థులతో సులభంగా గుర్తించి నోట్స్ రాయించడం వంటి బోధనా పద్ధతులు కలెక్టర్ పరిశీలించారు.

ఇంగ్లీష్ లో ఉన్న ప్రశ్నలను అర్థం చేసుకునేలా అవసరమైన చోట తెలుగులోనూ వివరించాలని, కేవలం నిర్వచనాలు నేర్చుకోవడమే కాకుండా పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలలో ఏడు ల్యాప్‌టాప్‌లు, ఆరు కంప్యూటర్ల పనితీరుపై ఆరాతీసి పాత కంప్యూటర్లకు అవసరానికి అనుగుణంగా అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. డిజిటల్ వనరులను కేవలం అందుబాటులో ఉంచడమే కాకుండా విద్యార్థుల అభ్యసనానికి ఉపయోగపడేలా ప్రతిరోజూ వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట డిప్యూటీ తాసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, ఎంఈవో యదుసింహరాజు ఉన్నారు.

గురు తేగ్ బహదూర్ జీ ప్రాణ త్యాగం మరువలేనివి

(24 నవంబర్ "గురు తేగ్ బహదూర్ త్యాగ దినం" సందర్భంగా)

సిక్కు మతానికి చెందిన 9వ గురువుగా "గురు తేగ్ బహదూర్ జీ" చేసిన ప్రాణ త్యాగం చిరస్మరణీయం, నేటి సమాజానికి ఆదర్శం. ప్రతి ఏట 24 నవంబర్ రోజు "గురు తేగ్ బహదూర్ షహీదీ దివస్ (త్యాగ దినం)" పాటించుట సిక్కు మతస్థులకు పరిపాటి అయ్యింది. 1975లో మత స్వేచ్ఛ, మానవ హక్కుల పరిరక్షణ కోసం పోరాడి తన ప్రాణాలను సహితం త్యాగం చేసిన ఒక పవిత్ర దినంగా షహీదీ దినం జరుపుకోవడం జరుగుతోంది. భారత చరిత్రలో మత స్వేచ్ఛ, సహనానికి ప్రతీకగా నిలిచిన తేగ్ బహదూర్ త్యాగం తరతరాలకు స్ఫూర్తిని ఇస్తూనే ఉన్నది. ధర్మ స్థాపన, బలవంతపు మత మార్పిడికి వ్యతిరేకంగా నాటి చక్రవర్తి ఔరంగాజేబ్ హిందువులు, సిక్కులను ఇస్లామ్ మతానికి మారాలని హింసించడం, చివరికి తేగ్ బహదూర్‌ను ప్రజల ముందు ఉరి తీయడం కూడా జరిగింది.

హింద్ కీ చాదర్ బిరుదు గ్రహీత:

01 ఏప్రిల్ 1621 రోజు జన్మించిన గురు తేగ్ బహదూర్ జీ 11 నవంబర్ 1975 రోజు అమరత్వం పొందారు. ప్రజలందరి మత స్వేచ్ఛను కాపాడటంలో ఆయన అచంచలమైన నిబద్ధతకు ఆయనను "హింద్ కీ చాదర్ (భారత దేశ కవచం)" అని కూడా పిలుస్తుంటారు. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు అణచివేత పాలనలో, తేగ్ బహదూర్ నిర్భయంగా బలవంతపు మత మార్పిడులను వ్యతిరేకించాడు. మత మార్పిడిని వ్యతిరేకించిన తేగ్ బహదూర్‌ను 4 నెలలు అరెస్టు చేసి 11 నవంబర్ 1675 రోజు ఢిల్లీ చాందినీ చౌక్ మార్కెట్ వద్ద బహిరంగంగా ఉరి తీయడం జరిగింది. కాశ్మీరీ పండితులు, ఇతర హిందూ సమాజం ఎదుర్కొంటున్న హింసకు వ్యతిరేకంగా కూడా పోరాడి తన ప్రాణాలను అర్పించిన మహనీయుడు గురు తేగ్ బహదూర్ జీ. ఆయన ప్రదర్శించిన త్యాగం, ధైర్యం, ఆత్మ విశ్వాసం, దయ, కరుణ, దాతృత్వం, ప్రతికూల పరిస్థితుల్లో కూడా నిటారుగా నిలబడడం, చక్రవర్తిని సహితం ఎదిరించడం లాంటి ప్రత్యేక లక్షణాలు సిక్కులకే కాకుండా హిందూ పౌర సమాజానికి దారి దీపంగా నిలుస్తున్నాయి.

గురు తేజ్ బహదూర్ జీ బలిదానం:

తేజ్ బహదూర్ జీ బోధనలు, కీర్తనలు లక్షలాది మందికి స్ఫూర్తిని ఇస్తున్నాయి. సిక్కు తత్వశాస్త్రంపై లోతైన అవగాహన కలిగిన గురు తేగ్ బహదూర్ రచనలు మార్గదర్శకత్వం వహిస్తున్నాయి. ఆయన వారసత్వం మన ఆధునిక ప్రపంచంలో ఉత్సాహం, సందర్భోచితంగా ఉన్నాయి. గురు తేగ్ బహదూర్ బలిదాన దినోత్సవాన్ని 24 నవంబర్ రోజు జరుపుకుంటున్నారు. గురు తేగ్ బహదూర్ గురు గ్రంథ్ సాహిబ్‌కు 700లకు పైగా శ్లోకాలను అందించారు. ఈ శ్లోకాల్లో భగవంతుడు, మానవ జీవితం, మరణం, విముక్తి వంటి లోతైన ఇతివృత్తాలను వివరించారు. దేశమంతటా పర్యటిస్తూ, సిక్కు దేవాలయాల స్థాపన, హిమాలయ పర్వత ప్రాంతంలో ఆనంద్‌పూర్ సాహిబ్ అనే నగరాన్ని స్థాపించాడు.

ప్రపంచ మానవాళికి మత స్వేచ్ఛ, న్యాయం కల్పించాలని తన జీవితాంతం పోరాడిన మహాయోధుడు గురు తేగ్ బహదూర్ జీ చూపిన బాటలో నడుస్తూ ప్రపంచశాంతికి పునాదిగా నిలవాలని కోరుకుందాం.



-మధుపాళీ
9949700037

రాత్రికి రాత్రే మార్పు తేకపోయినా... ఆలోచనలను తట్టిలేపే శక్తి గలవే సినిమాలు: 'ఫాదర్‌ల్యాండ్' నిర్మాత ఈవా పుష్చిజిన్‌స్కా

న్యూ ఢిల్లీ, నవంబర్ 23: 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవ (ఐఎఫ్ఎఫ్ఐ) ప్రారంభ చిత్రం 'ఫాదర్‌ల్యాండ్' నిర్మాత, ప్రముఖ పోలిష్ సినీ నిర్మాత ఈవా పుష్చిజిన్‌స్కా ఈ రోజు మీడియాతో మాట్లాడారు. "సినిమాలు ప్రపంచాన్ని రాత్రికి రాత్రే మార్చకపోవచ్చు. మనుషుల్లో ఆలోచనలను మేల్కొల్పగలవు. చర్చలను ప్రోత్సహించగలవు. తమ చుట్టూ ఉన్న ప్రపంచం గురించి లోతుగా ఆలోచించేలా ప్రజలను ప్రేరేపించగలవు" అని ఆమె పేర్కొన్నారు.

ఐఎఫ్ఎఫ్ఐ వేదికగా జరిగిన ఈ విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... భిన్న దృక్పథాలను అర్థం చేసుకునేలా చేస్తూ, చర్చలను ప్రోత్సహించడం ద్వారా ప్రజలను వరస్పరం మరింత చేరువ చేయడంలో సినిమాల కీలక పాత్రను ప్రముఖంగా ప్రస్తావించారు. "మన సినిమాల ద్వారా మనం ప్రజలతో మాట్లాడాలి. జీవితంలోని మరో కోణాన్ని, ప్రపంచంలోని భిన్న పార్శ్వాలనూ వారు అర్థం చేసుకునేలా వారి ఆలోచనా పరిధిని విస్తృతం చేయాలి" అని ఈవా పేర్కొన్నారు.

సమకాలీన సమాజంలో నెలకొన్న విభజనలను ప్రస్తావిస్తూ... ఏ ఒక్క కథనం లేదా ఎజెండా మాత్రమే సరైన దృక్పథమని చెప్పలేమని ఈవా అభిప్రాయపడ్డారు. నేటి కాలంలో ప్రజలు ఒకరి మాట ఒకరు గౌరవించడం కంటే, ఎవరి వాదనలకు వారు కట్టుబడి ఉండే ధోరణి పెరుగుతోందని ఆమె పేర్కొన్నారు. "ఏ ఒక్క ఎజెండా గానీ, ఏ ఒక్క కథనం గానీ పూర్తిగా సరైనది కాలేదు. ఒకరితో ఒకరు మాట్లాడుకోండి, మనందరినీ కలిపే ఉమ్మడి అంశాన్ని అన్వేషిద్దాం" అని ఆమె పిలుపునిచ్చారు.

'ఫాదర్‌ల్యాండ్' చిత్రాన్ని అనేక పార్శ్వాలు గల కథగా అభివర్ణించిన ఈవా... ఈ సినిమా సమకాలీన ప్రపంచంతో మమేకమయ్యే అంశాలను అన్వేషిస్తుందని పేర్కొన్నారు. 1949 నాటి విభజిత ఐరోపా నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం... నాటి తూర్పు-పశ్చిమ దేశాల మధ్య చీలికలతో పాటు నేటి సమాజాలను ప్రభావితం చేస్తున్న విభజనలనూ ప్రతిబింబిస్తుంది. ముఖ్యంగా వలసలతో కూడిన నేటి ప్రపంచంలో గుర్తింపు, సొంతం అనే భావనలపై ఈ సినిమా లోతైన ప్రశ్నలను లేవనెత్తుతుంది. "మీ మాతృభూమి ఎక్కడ ఉంది? అది మీరు నివసిస్తున్న దేశమా, లేక మీరు మాట్లాడే భాషా? మీ చరిత్ర పుట్టిన చోటా, లేక ప్రస్తుతం మీరు జీవిస్తున్న దేశమా?" అని ప్రశ్నిస్తూ... ప్రజలకు, వారి మాతృభూమికి మధ్య ఉండే సంక్లిష్టమైన అనుబంధాన్ని ఈ చిత్రం ఎలా విశ్లేషిస్తుందో ఈవా వివరించారు.

ప్రఖ్యాత జర్మన్ రచయిత థామస్ మాన్, ఆయన కుటుంబ కథ ద్వారా 'ఫాదర్‌ల్యాండ్' చిత్రం... సంస్కృతికి, సమాజానికి మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని అన్వేషిస్తుంది. సాహిత్యం, సాంస్కృతిక దిగ్గజాలు ప్రజలకు ఆదర్శమూర్తులుగా నిలవడంతో పాటు స్ఫూర్తినీ అందించగలరని ఈవా అభిప్రాయపడ్డారు. తల్లిదండ్రులు-ఎల్లలు, తోబుట్టువులు, కళాకారుల మధ్య ఉండే సంక్లిష్టమైన కుటుంబ సంబంధాలను ఈ చిత్రం లోతుగా విశ్లేషిస్తుంది. ప్రముఖ కళాకారుల పిల్లలు ఎదుర్కొనే సవాళ్లు, తమ తల్లిదండ్రుల విజయాలను అందుకోవాలనే అంచనాల ఒత్తిడినీ ఇందులో ఆవిష్కరించారు. మరింత విస్తృత స్థాయిలో చూస్తే... చరిత్రలో జరిగే పెను మార్పులు సాధారణ వ్యక్తుల దైనందిన జీవితాలను ఎలా ప్రభావితం చేస్తాయో ఈ సినిమా కళ్లకు కడుతుంది.

ఈ చిత్రం దృశ్య రూపకల్పన గురించి ఈవా వివరిస్తూ... దర్శకుడు పావెల్ పాష్లికోవ్‌స్కీతో గతంలో తాను కలిసి పనిచేసిన 'ఇడా', 'కోల్డ్ వార్' చిత్రాల తరహాలోనే 'ఫాదర్‌ల్యాండ్' సినిమానూ బ్లాక్ అండ్ వైట్‌లో, 4:3 ఆస్పెక్ట్ రేషియోలో చిత్రీకరించినట్లు తెలిపారు. సినిమాలో చూపించిన ఆనాటి కాలానికి సహజత్వాన్ని ఆపాదించాలనే ఉద్దేశంతోనే ఈ విధానాన్ని ఎంచుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. "మేం చర్చిస్తున్న ఆ కాలానికి సినిమా అత్యంత సహజంగా, వాస్తవికంగా కనిపించాలని కోరుకున్నాం. ఈ 'ఫాదర్‌ల్యాండ్' చిత్రాన్ని ఆ త్రయంలో మూడో సినిమాగా భావించవచ్చు" అని ఆమె అన్నారు.

నిర్మాణ ప్రక్రియ గురించి ఆమె మాట్లాడుతూ... పోలండ్, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్ దేశాల భాగస్వామ్యంతో రూపొందిన అంతర్జాతీయ సహ-నిర్మాణ చిత్రమే 'ఫాదర్‌ల్యాండ్' అని వివరించారు. ఈ కథ జర్మనీ నేపథ్యంలో సాగినప్పటికీ, సినిమాలో దాదాపు 95 శాతం చిత్రీకరణ పోలండ్‌లోనే జరిగిందన్నారు. ఇందులో పనిచేసిన సృజనాత్మక, సాంకేతిక బృందాల్లో అత్యధికులు పోలిష్ నిపుణులేనని ఆమె తెలిపారు. 1949 నాటి జర్మనీ వాతావరణాన్ని తిరిగి సృష్టించడంలో... శిథిలావస్థలో ఉన్న, నిరాదరణకు గురైన వీధులు, భవనాలు, చిన్న పట్టణాలు పోలండ్‌లో అందుబాటులో ఉండటం ఎంతో తోడ్పడిందని ఈవా పేర్కొన్నారు.

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో భారత్‌లో తలదాచుకున్న పోలిష్ చిన్నారుల గాథ సహా... భారత్-పోలండ్ దేశాల ఉమ్మడి చారిత్రక నేపథ్యంతో ఓ చిత్రాన్ని తెరకెక్కించే ఆలోచన పట్ల ఈవా ఆసక్తి వ్యక్తం చేశారు. ఈ ఇతివృత్తంపై ఇప్పటికే కథను సిద్ధం చేసిన ఐఎఫ్ఎఫ్ఐ ఫెస్టివల్ డైరెక్టర్ అశుతోష్ గోవారికర్‌తో తాను జరిపిన భేటీని ఆమె గుర్తు చేసుకున్నారు. ఈ అంశంపై చర్చలు మరింత ముందుకు సాగి, ఇరు దేశాల కలయికలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కే అవకాశాలు మెరుగవుతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

57వ ఇఫీ వేదికగా ప్రారంభమైన 'క్రియేటివ్ మైండ్స్ ఆఫ్ టుమారో' (సీఎంఓటీ) ఆరో విడత

న్యూ ఢిల్లీ, నవంబర్ 23:సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (ఎన్ఎఫ్‌డీసీ) నిర్వహిస్తోన్న 'క్రియేటివ్ మైండ్స్ ఆఫ్ టుమారో' (సీఎంఓటీ) ఆరో విడత కార్యక్రమం... 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో (ఇఫీ) భాగంగా నేడు గోవాలోని కళా అకాడమీలో ప్రారంభమైంది.

ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఉన్న 100 మంది యువ సృజనాత్మక ప్రతిభావంతులను ఒకదగ్గరికి తీసుకువస్తూ వారు పరస్పరం సహకరించుకోవడానికి, తమ నైపుణ్యాలను ప్రదర్శించడానికి, చిత్ర పరిశ్రమ అనుభవాన్ని పొందడానికి ఒక వేదికను కల్పిస్తోంది.

ఈ ప్రారంభోత్సవ వేడుకకు సమాచార- ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ చంచల్ కుమార్, సమాచార- ప్రసార మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ ప్రభాత్, ఎఫ్‌టీఐఐ రిజిస్ట్రార్ శ్రీ లౌకిక్ పరాఖ్, సమాచార- ప్రసార మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ కె. కె. నిరాలా, ఎన్ఎఫ్‌డీసీ ఛైర్మన్ శ్రీ జీ. కృష్ణకుమార్, ఎన్ఎఫ్‌డీసీ జనరల్ మేనేజర్ శ్రీ గౌతమ్ భానోట్ హాజరయ్యారు.

కార్యక్రమాన్ని ఉద్దేశించి సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ చంచల్ కుమార్ మాట్లాడుతూ.. పాల్గొనే ప్రతి ఒక్కరూ ఇప్పటికే తమదైన ముద్ర వేశారు కాబట్టే ఇక్కడ ఉన్నారన్నారు. ఆ ప్రతిభను ఒక చలనచిత్రంగా మలచుకోవడానికి రాబోయే 48 గంటలు వారికి ఒక చక్కటి అవకాశాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు.

మూలాలు అనేవి సంస్కృతి, భాష, అనుభవాల నుంచి ఏర్పడతాయని.. అదే సమయంలో కలలు అనేవి ఊహాశక్తి, జిజ్ఞాస, కొత్తదనాన్ని ప్రయత్నించే ధైర్యం నుంచి ఉద్భవిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఫ్రెంచ్ తత్వవేత్త జోసెఫ్ జౌబర్ట్ మాటలను ప్రస్తావిస్తూ ఊహాశక్తి కలలు కనడానికి తోడ్పడు తుందని, కళా నైపుణ్యాన్ని సంపాదించుకోవటం అనేది ఆ కలలకు దిశానిర్దేశం చేస్తుందని, మూలాలు కథలకు తమదైన గళాన్ని అందిస్తాయని ఆయన వివరించారు.

పాల్గొనేవారు తమ కథల పరిధిని పరిమితం చేసుకోకుండా, తమ మూలాల నుంచి స్ఫూర్తి పొందాలని ఆయన పిలుపునిచ్చారు. భారత్‌లోని ఒక చిన్న గ్రామం నుంచి పుట్టిన కథ అయినప్పటికీ నిజాయితీతో చెప్పినట్లయితే అది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల హృదయాలను తాకగలదని ఆయన అన్నారు.

సినిమా ఒక సమష్టి కళా రూపమని ఆయన అన్నారు. పాల్గొనేవారు ఒకరి మాట ఒకరు వినాలని, తమ సహచర బృంద సభ్యులను నమ్మాలని, ప్రయోగాలు చేయాలని, సృజనాత్మక సాహసాలు చేయాలని, ఈ నిర్మాణ ప్రక్రియను ఆస్వాదించాలని పిలుపునిచ్చారు. తమ మూలాలను వెంట తీసుకువెళ్తూ తమ ఊహాశక్తికి రెక్కలు తొడగాలని, తమ కథలను ప్రపంచానికి వరిచయం చేయాలని కోరుతూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

ఈ ప్రారంభోత్సవ వేడుకలో '48-గంటల ఫిల్మ్ మేకింగ్ ఛాలెంజ్'ను అధికారికంగా ప్రారంభించడం ఒక ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రత్యేకంగా రూపొందించిన ఫిల్మ్ స్లేట్‌ను కొట్టిన కార్యదర్శి.. ఈ ఛాలెంజ్ ఆరో ఎడిషన్‌కు శ్రీకారం చుట్టారు.

2026 బృందంలో 13 చలనచిత్ర నిర్మాణ విభాగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 100 మంది ప్రతిభావంతులు ఉన్నారు. వీటిలో దర్శకత్వం, నటన, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్- సబ్‌టైటిలింగ్, స్క్రిప్ట్ రైటింగ్, నేపథ్య గానం, సంగీత దర్శకత్వం, సౌండ్ రికార్డింగ్, కాస్ట్యూమ్ డిజైన్, హెయిర్-మేకప్, కళా దర్శకత్వం, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్ (వీఎఫ్ఎక్స్), ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, వాయిస్ ఓవర్- డబ్బింగ్ విభాగాలు ఉన్నాయి.

ఎన్ఎఫ్‌డీసీ సహకారంతో పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐఐ) నిర్వహిస్తున్న ఈ 48-గంటల ఫిల్మ్ మేకింగ్ ఛాలెంజ్‌లో పాల్గొనేవారు 5 బృందాలుగా ఏర్పడి 48 గంటల నిర్మాణ వ్యవధిలో లఘు చిత్రాలను తీస్తారు. పూర్తైన చిత్రాలను ఇఫీలో ప్రత్యేకంగా ప్రదర్శించి చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖ నిపుణులతో కూడిన జ్యూరీ ద్వారా మదింపు చేస్తారు.

సీఎంఓటీ టాలెంట్ క్యాంప్.. పాల్గొనేవారిని మీడియా, వినోద పరిశ్రమతో మరింత అనుసంధానిస్తుంది. తద్వారా నిర్మాణ సంస్థలు, స్టూడియోలు, మ్యూజిక్ లేబుల్స్, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, ప్రసార సంస్థలు, ఇతర పరిశ్రమ భాగస్వాములతో సంభాషించే అవకాశాలను కల్పిస్తుంది.

2021లో ప్రారంభమైనప్పటి నుంచి సీఎంఓటీ వర్ధమాన సృజనాత్మక నిపుణులను మీడియా, వినోద పరిశ్రమతో అనుసంధానించే వేదికగా అభివృద్ధి చెందింది. దీని పూర్వ విద్యార్థులు అంతర్జాతీయ చిత్ర నిర్మాణాలలో పనిచేయడంతో పాటు కేన్స్, బెర్లినాలే, టొరంటో అంతర్జాతీయ చలనచిత్రోత్సవం.. అంతర్జాతీయ ఎమ్మీ అవార్డులు వంటి ప్రముఖ వేదికలు, చలనచిత్రోత్సవాలలో గుర్తింపు పొందారు. మునుపటి విడతలో పాల్గొన్న 18 మంది ప్రతిభావంతులు ముఖేష్ ఛాబ్రా కాస్టింగ్ కంపెనీ (ఎంసీసీసీ) ద్వారా ఎంపికవ్వటం విశేషం. సీఎంఓటీ ద్వారా మార్గదర్శకత్వం పొందిన నైపుణ్యాలను వృత్తివరమైన అవకాశాలుగా మలచటంలో ఇది ఒక ప్రోత్సాహకరమైన ముందడుగు.

ఆదివాసీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: బండి సంజయ్

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిని కలిసిన ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మధురాజ్ మడావి

ఆదిలాబాద్, నవంబర్ 23: కరీంనగర్‌లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆదివాసీ విద్యార్థి సంఘం కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు మధురాజ్ మడావి తెలిపారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

అలాగే, చల్మడ ఆనందరావు ఆసుపత్రిలో తన అమ్మమ్మ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్న విషయాన్ని వివరించినట్లు తెలిపారు. దీనిపై బండి సంజయ్ వెంటనే స్పందించి, ఆసుపత్రిలోని క్యాన్సర్ వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించినట్లు వెల్లడించారు.

ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు మధురాజ్ తెలిపారు. బీజేపీ కార్యక్రమాల గురించి కూడా మంత్రికి వివరించినట్లు పేర్కొన్నారు. తన అమ్మమ్మ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపి వైద్యులతో మాట్లాడినందుకు బండి సంజయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.10 లక్షలతో నిర్మించిన వీవో భవనం ప్రారంభం



ఆదిలాబాద్, నవంబర్ 23:మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని కాసిపేట గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన వీవో భవనాన్ని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల అదనపు కలెక్టర్ చంద్రయ్య, డీఆర్డీఏ అధికారి కిషన్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందన్నారు.

మహిళా సంఘాల బలోపేతానికి వీవో భవనాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.

మహిళలు సంఘాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తూ స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్కాకుల వనిత సృజన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అనధికార మరణ ధ్రువీకరణ పత్రాల జారీ.. ఐదుగురి అరెస్టు

ఎంపీవో కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్, కారోబార్ అరెస్టు
మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, మీసేవ ఆపరేటర్ కూడా..
ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.10 వేల నుంచి రూ.15 వేల వసూలు
వివరాలు వెల్లడించిన బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్

ఆదిలాబాద్, నవంబర్ 23:బెల్లంపల్లి మండలంలో అనధికారికంగా మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన కేసులో పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. అరెస్టు చేసిన వారిని న్యాయస్థానంలో హాజరుపరిచారు. శనివారం రాత్రి బెల్లంపల్లి రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ హనోక్ కేసు వివరాలను వెల్లడించారు.

ఈ నెల 17న బెల్లంపల్లి ఎంపీఓ గుమ్ముల కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎంపీఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న చిందం శ్రీనివాస్ వద్ద అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శుల డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్లు ఉన్నట్లు గుర్తించారు. డబ్బులకు ఆశపడి బూదాఖుర్దు గ్రామానికి సంబంధించి 16 మరణ ధ్రువీకరణ పత్రాలను అనధికారికంగా జారీ చేసినట్లు విచారణలో వెల్లడైంది. వీటిలో 11 సర్టిఫికెట్లను ఆ గ్రామ కారోబార్ చిందం రవి సహకారంతో జారీ చేసి ఒక్కోదానికి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి సాదుల్లా సెలవులో ఉన్న సమయంలో ఆయన డిజిటల్ సిగ్నేచర్‌ను అనుమతి లేకుండా ఉపయోగించారు. అప్పట్లో అదనపు బాధ్యతలు నిర్వహించిన కార్యదర్శి శ్రీనివాస్ లాగిన్ ద్వారా ఈ 16 సర్టిఫికెట్లు జారీ చేసినట్లు గుర్తించారు.

కంప్యూటర్ ఆపరేటర్ చిందం శ్రీనివాస్ పెర్కపల్లి గ్రామ పంచాయతీలోనూ ఎలాంటి అనుమతి లేకుండా మరో 11 మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. వీటిలో ఒకటి పెర్కపల్లికి సంబంధించింది కాగా, మిగిలిన 10 పెద్దపల్లి జిల్లాకు చెందినవిగా వెల్లడించారు. పంచాయతీ కార్యదర్శి స్నిగ్ధ డిజిటల్ సిగ్నేచర్‌ను ఉపయోగించి, ప్రస్తుత కార్యదర్శి సాయిరాం లాగిన్ ద్వారా వీటిని జారీ చేసినట్లు తెలిపారు.

ఈ అక్రమ వ్యవహారంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ వైకుంఠం, గోదావరిఖనికి చెందిన రామగుండం మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న ఆనంద్, సాగర్, మీసేవ ఆపరేటర్ నరేందర్ ప్రమేయం ఉన్నట్లు విచారణలో తేలిందని సీఐ వెల్లడించారు. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేసినట్లు తెలిపారు.

ఈ కేసులో మంచిర్యాలకు చెందిన వైకుంఠం పరారీలో ఉండగా, చిందం శ్రీనివాస్, చిందం రవి, ఆనంద్, సాగర్, నరేందర్‌లను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు సీఐ హనోక్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో తాళ్లగురిజాల, టూటౌన్ ఎస్సైలు ప్రశాంత్ కుమార్, తిరుపతితోపాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగి దారుణ హత్య..

ఫోన్ కాల్‌తో ఇంటి నుంచి బయటకు.. చివరకు హత్య!

కరీంనగర్, నవంబర్ 23:పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో సింగరేణి ఉద్యోగి దారుణ హత్యకు గురయ్యాడు. స్థానిక పోలీస్ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకుంది. సప్తగిరి కాలనీకి చెందిన రాజశేఖర్‌పై గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి హత్య చేశారు. ఈ ఘటన సోమవారం పట్టణంలో కలకలం రేపింది.

ఆదివారం అర్ధరాత్రి సమయంలో రాజశేఖర్‌కు వచ్చిన ఫోన్ కాల్‌తో ఆయన ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఆయనను ఎవరు పిలిచారు? హత్యకు గల కారణాలేంటి? అన్నది ఇంకా తెలియరాలేదు. సమాచారం అందుకున్న గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఫోన్ కాల్ వివరాలు, హత్యకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

దళితుల ఐక్యతతోనే హక్కుల పరిరక్షణ

-పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ

కరీంనగర్, నవంబర్ 23:దళితుల హక్కులు, ఆత్మగౌరవ పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పిలుపునిచ్చారు. పెద్దపల్లి పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం 50వ స్వర్ణోత్సవ మహాసభలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు.

తొలుత బస్టాండ్ ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎంపీ.. అనంతరం ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. సంఘం నాయకులు, సభ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయాల సాధన కోసం ఐదు దశాబ్దాలుగా కృషి చేస్తున్న సంఘానికి అభినందనలు తెలిపారు. ప్రజా స్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా నియంతృత్వ ధోరణులు పెరు గుతున్నాయని, ప్రజల గొంతుకను నొక్కేస్తూ విభజించు పాలించు విధానాన్ని అనుసరిస్తున్నారని విమర్శించారు.

దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను అంబేద్కర్ వాదులంతా ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. విద్య, నిధుల కేటాయింపుల్లో దళితులకు అన్యాయం జరుగుతోందని, దళిత సమాజ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంబేద్కర్ సూచించిన బోధించు.. సమీకరించు.. పోరాడు అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

శతాబ్ది వేడుకల సందర్భంగా భారతీయ సినిమాకు చెందిన ఏడుగురు దిగ్గజాలకు ఇఫి 2026 సత్కారం

న్యూ ఢిల్లీ, నవంబర్ 23: భారతీయ చలనచిత్ర రంగానికి 1926 అసాధారణమైన ఏడాదిగా నిలిచింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు, విభిన్న కుటుంబాలు, సాంస్కృతిక సంప్రదాయాలకు చెందిన ఏడు గురు ప్రముఖులు ఆ ఏడాదిలో జన్మించారు. వెండితెరపై చెరగని ముద్ర వేసిన వీరే.. బెంగాలీ సినిమాకు చెందిన దిగ్గజ నటుడు 'మహానాయక్' ఉత్తమ్ కుమార్, హిందీ చిత్రసీమలో చిరస్మరణీయ చిత్రాలను అందించిన ప్రముఖ దర్శకుడు శక్తి సామంత, తరతరాల ప్రేక్షకులను అలరిస్తున్న మధురమైన గీతాలను అందించిన సంగీత మాంత్రికుడు ఓపీ నయ్యర్, గ్రామీణ, చారిత్రక, పౌరాణిక కథాంశాల్లో తనదైన నటనతో మరాఠీ సినిమాను సుసంపన్నం చేసిన పద్మశ్రీ పురస్కార గ్రహీత సూర్యకాంత్ మాంధరే, మలయాళ చిత్రసీమలో చిరకాలం గుర్తుండిపోయే రొమాంటిక్ హీరో ప్రేమ్ నజీర్, తన ప్రత్యేకమైన స్వరం, విలక్షణమైన అభినయ శైలితో బాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు పొందిన నటుడు రాజ్ కుమార్, అలాగే 'చౌదవీ కా చాంద్', 'గుమ్రా', 'వక్త్', 'హమ్‌రాజ్' వంటి చిరస్మరణీయ సంగీత సంపదను అందించిన ప్రతిభావంతుడైన స్వరకర్త రవి (బాంబే రవి).

వందేళ్ల తర్వాత, 57వ అంతర్జాతీయ భారత చలన చిత్రోత్సవం (ఇఫి) ఈ ఏడుగురి శతజయంతి సందర్భంగా నాలుగు భాషల్లోని అయిదు పునరుద్ధరించిన చిత్రాలను ప్రదర్శిస్తోంది. హిందీ, బెంగాలీ, మలయాళం, మరాఠీ భాషల్లో రూపొందిన ఈ చిత్రాలు.. శతజయంతి జరుపుకుంటున్న ఈ కళాకారుల అత్యంత ప్రసిద్ధ రచనల్లో కొన్ని. భారతీయ చలనచిత్ర వారసత్వాన్ని పరిరక్షించడం, సంరక్షించడం, డిజిటలైజ్ చేయడం, పునరుద్ధరించడం లక్ష్యంగా సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమమైన జాతీయ చలనచిత్ర వారసత్వ మిషన్ కింద జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (ఎన్ఎఫ్‌డీసీ) ఈ చిత్రాలన్నింటినీ పునరుద్ధరించింది.

చౌరింగీ చిత్రంలో ఉత్తమ్ కుమార్

1965లో వచ్చిన బెంగాలీ క్లాసిక్ 'చౌరింగీ'.. బెంగాలీ సినిమా చరిత్రలో అత్యుత్తమ నమ్మశక్య నటనల్లో ఒకదాన్ని ఆవిష్కరించింది. బెంగాలీ చిత్రసీమలో అత్యంత ప్రజాదరణ పొందిన నటుడైన ఉత్తమ్ కుమార్.. తన కెరీర్‌లో అత్యున్నత ప్రజాదరణ పొందుతున్న సమయంలో ఈ చిత్రంలో సత్యసుందర్ 'సతా' బోస్ పాత్రను అంగీకరించారు. 1948లో నటుడిగా కెరీర్ ప్రారంభించిన ఆయన.. మూడు దశాబ్దాల పాటు 200కు పైగా చిత్రాల్లో నటించారు. 'సప్తపది', 'హరానో సుర్', 'నాయక్', 'చిరియాఖానా', 'అమానుష్' తదితర ఎన్నో క్లాసిక్ చిత్రాలను అందించారు. బెంగాలీ సినిమాల్లో నటనను రంగస్థల శైలి నుంచి పట్టణ నేపథ్యంలోని రొమాంటిక్ అభినయం వైపు మళ్లించారు.

దర్శకుడు శక్తి సామంత, సంగీత దర్శకుడు ఓపీ నయ్యర్‌ల 'కాశ్మీర్ కీ కలి'

'కాశ్మీర్ కీ కలి' చిత్రం దర్శకుడిగా శక్తి సామంత, సంగీత దర్శకుడిగా ఓపీ నయ్యర్ ఇద్దరినీ వారి కెరీర్‌లో అత్యున్నత స్థాయికి చేర్చింది. కాశ్మీర్ స్వర్గసీమ అందాలను శక్తి సామంత మూర్తి రంగుల్లో చిత్రీకరించి సినీ ప్రేక్షకులకు చూపించగా.. ఓపీ నయ్యర్ అందించిన సంగీత బాణీలు నేటికీ శ్రోతలను అలరిస్తున్నాయి.

శక్తి సామంత 1948లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. 1955లో 'బహు' చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేశారు. తన సొంత నిర్మాణ సంస్థ 'శక్తి ఫిల్మ్స్' బ్యానర్‌పై మొత్తం 43 చిత్రాలకు దర్శకత్వం వహించారు. వీటిలో 37 హిందీ చిత్రాలు కాగా, ఆరు బెంగాలీ చిత్రాలు. 'హౌరా బ్రిడ్జ్', 'చైనా టౌన్', 'యాన్ ఈవెనింగ్ ఇన్ పారిస్', 'ఆరాధన', 'కటి పతంగ్', 'అమర్ ప్రేమ్', 'అనురాగ్' వంటి హిందీ సినీ క్లాసిక్ చిత్రాలను ఆయన అందించారు.

ఓంకార్ ప్రసాద్ నయ్యర్ 1952లో 'ఆస్మాన్' చిత్రంతో సినీ రంగంలో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత 'ఆర్ పార్', 'మిస్టర్ అండ్ మిసెస్ 55', 'సీఐడీ', 'నయా దౌర్', 'హౌరా బ్రిడ్జ్' వంటి చిత్రాలకు సంగీతం అందించారు. మహమ్మద్ రఫీ, ఆశా భోంస్లే, గీతా దత్ వంటి గాయనీగాయకులతో ఆయన చేసిన సంగీత ప్రయాణం.. హిందీ సినిమా సంగీత చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయే ఎన్నో పాటలకు దారితీసింది. గుర్రపు డెక్కల పరుగును తలపించే లయలు, ధోలక్ తాళాలతో ఆయన ప్రత్యేకమైన సంగీత శైలిని సృష్టించారు. ఈ శైలిని ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారు.

'సాధీ మానసే' చిత్రంలో సూర్యకాంత్ మాంధరే

సూర్యకాంత్ మాంధరే బాల్యంలోనే తన గురువు భాల్జీ పెంధార్కర్ దృష్టిలో పడ్డారు. బాలనటుడిగా తన సినీ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అయిదు దశాబ్దాల పాటు సాగిన కెరీర్‌లో వందకు పైగా చిత్రాల్లో నటించారు. 'సాంగ్‌త్యే ఐకా', 'కన్యాదాన్', 'మోహిత్యాంచీ మంజుల', 'మల్హారీ మార్తాండ' వంటి చిత్రాలతో గ్రామీణ, చారిత్రక, పౌరాణిక నేపథ్యాలకు చెందిన మరాఠీ సినిమా అత్యంత బలమైన పాత్రలకు ప్రాణం పోశారు.

1965లో వచ్చిన క్లాసిక్ చిత్రం 'సాధీ మానసే'లో ఆయన శంకర్ అనే కమ్మరి పాత్రను పోషించారు. ఆత్మన్యూనత, ఆడంబరాలకు దూరంగా ఉండే బలమైన వ్యక్తిత్వానికి, శ్రమ గౌరవానికి, తనను తప్పుగా అర్థం చేసుకున్నప్పుడు కలిగే ఆవేదనకు ఈ పాత్ర ప్రతీకగా నిలుస్తుంది. ఈ చిత్రంలో ఆయనకు జోడీగా జయశ్రీ గడ్కర్ నటించారు. వీరిద్దరూ గతంలోనూ అనేక చిత్రాల్లో జంటగా నటించారు. ఈ చిత్రానికి సంబంధించిన మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ప్రముఖ గాయని లతా మంగేష్కర్ 'ఆనంద్‌ఘన్' అనే కలం పేరుతో దీనికి సంగీతం సమకూర్చారు. మరాఠీ చిత్రాలకు పనిచేసేటప్పుడు ఆమె తరచుగా ఈ పేరును ఉపయోగించేవారు.

పాటలకు, సహజత్వంతో కూడిన కథలకు ప్రసిద్ధి చెందిన మలయాళ చిత్రసీమలో చిరకాలం గుర్తుండిపోయే రొమాంటిక్ హీరో ప్రేమ్ నజీర్.. 'తులాభారం' చిత్రంలో ఫ్యాక్టరీ కార్మికుడు, ట్రేడ్ యూనియన్ కార్యకర్త అయిన రామ పాత్రను పోషించారు. రొమాంటిక్ హీరోగా అత్యంత గుర్తింపు పొందిన ఈ దిగ్గజ నటుడు.. తన గ్లామరస్ తెర రూపాన్ని పక్కనపెట్టి, ఎంతో సంయమనంతో కూడిన నటనను ప్రదర్శించారు. ఇది ఆయన కెరీర్‌లోనే అత్యుత్తమ నటనల్లో ఒకటిగా చెప్పవచ్చు.

'ఇరుట్టింటే ఆత్మావు', 'ముంపెన్ను', 'నది' నుంచి 'కల్లిచెల్ల మ్మ', 'విడ పారయుం మున్పే', 'పడయొట్టం' వరకు ప్రేమ్ నజీర్ తన నటనతో ప్రేమకథల నుంచి పౌరాణిక, సామాజిక సంస్కరణ ఇతివృత్తాల వరకు విభిన్న పాత్రలు పోషించారు. 700కు పైగా చిత్రాల్లో కథానాయకుడిగా నటించినందుకు, షీలా సరసన 130 చిత్రాల్లో నటించినందుకు ఆయన రెండు గిన్నిస్ ప్రపంచ రికార్డులు సాధించారు. 1983లో పద్మభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు.

తనదైన తెర ఉనికి, గంభీరమైన స్వరం, స్పష్టమైన సంభాషణల ఉచ్చారణ, విలక్షణమైన వ్యక్తిత్వంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న దిగ్గజ నటుడు రాజ్ కుమార్.. ప్రముఖ సంగీత దర్శకుడు రవితో కలిసి యశ్ చోప్రా రూపొందించిన మల్టీస్టారర్ చిత్రం 'వక్త్'లో నటించారు. ఈ చిత్రంలో రాజ్ కుమార్ దొంగ రాజా పాత్రలో చూపిన అద్భుత నటనతో పాటు, రవి స్వరపరిచిన ప్రజాదరణ పొందిన 'ఏ మేరీ జోహ్రా జబీన్' పాట కూడా ప్రత్యేక గుర్తింపు పొందాయి.

రాజ్ కుమార్ 1952లో 'రంగీలీ' చిత్రంతో సినీ రంగంలోకి అడుగుపెట్టారు. 'నౌషెర్వాన్-ఎ-ఆదిల్', 'మదర్ ఇండియా' చిత్రాల్లో నటనతో గుర్తింపు పొందారు. ఆ తర్వాత 1963లో వచ్చిన 'దిల్ ఏక్ మందిర్'తో మరింత పేరు తెచ్చుకున్నారు. అనంతరం 'వక్త్', 'హీర్ రాంఝా', 'పాకీజా', 'తిరంగా' తదితర చిత్రాల్లో చిరస్మరణీయ పాత్రలు పోషించారు.

మలయాళ చిత్రసీమలో బాంబే రవిగా ప్రసిద్ధి చెందిన రవిశంకర్ శర్మ.. 1955లో 'వచన్' చిత్రంతో హిందీ సినీ రంగంలో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. 'చౌధ్వీన్ కా చాంద్', 'గుమ్రా', 'వక్త్', 'హమ్‌రాజ్' చిత్రాలకు అందించిన సంగీతంతో ఆయన గుర్తింపు పొందారు. 'వరిణయం', 'నుకృతం' చిత్రాలకు ఉత్తమ సంగీత దర్శకత్వంలో జాతీయ చలనచిత్ర పురస్కారాన్ని అందుకున్నారు.

ఈ ప్రత్యేకంగా రూపొందించిన శతజయంతి నివాళుల కార్యక్రమం ద్వారా 57వ ఇఫి.. ఏడుగురు అసాధారణ ప్రతిభావంతులను మాత్రమే కాకుండా, వారు అందించిన సృజనాత్మక వారసత్వాన్ని కూడా వేడుకగా జరుపుకోనుంది. వారి వారసత్వం తరతరాలకు స్ఫూర్తినిస్తూ, భారతీయ సినిమా శాశ్వతమైన వైభవాన్ని చాటుతోంది.

వారు జన్మించి వందేళ్లు పూర్తయినప్పటికీ, ఈ ఏడుగురు దిగ్గజాల చిత్రాలు భారతీయ సినిమా అసాధారణ వైవిధ్యానికి, సృజనాత్మక ఆకాంక్షలకు, కళాత్మక నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ పునరుద్ధరించిన క్లాసిక్ చిత్రాల ద్వారా 57వ ఇఫి.. ప్రేక్షకులకు చిరస్మరణీయ నటనలు, మధురమైన పాటలు, కథలను మరోసారి ఆస్వాదించే అవకాశాన్ని కల్పిస్తోంది. అంతేకాకుండా, వారు రూపుదిద్దడంలో కీలక పాత్ర పోషించిన సినీ సంప్రదాయాలు, సాంస్కృతిక చరిత్రలను తిరిగి గుర్తుచేసుకునే అవకాశం కల్పిస్తోంది.

ఏడుగురు వ్యక్తుల వ్యక్తిగత వారసత్వానికి నివాళి అర్పించడమే కాకుండా, భారతీయ చలనచిత్ర వారసత్వాన్ని పరిరక్షించడం, భవిష్యత్తు తరాలకు అందుబాటులో ఉంచడం ఎంత ముఖ్యమో ఈ శతజయంతి వేడుక మరోసారి చాటుతోంది.

ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న కమిషనర్

14 నెలల్లో విద్యానగర్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చొరవ
22 రోడ్లకు అభివృద్ధి పనులు.. కమిషనర్ అభిషేక్ అగస్త్యకు ప్రశంసల వెల్లువ
వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధుల అభినందన

ఖమ్మం, నవంబర్ 23:ప్రజలకు ఇచ్చిన హామీని ఆచరణలో చూపిస్తూ అభివృద్ధి పనులతో నమ్మకాన్ని నిలబెట్టుకున్నారు ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య. ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని విద్యానగర్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, 14 నెలల వ్యవధిలోనే మౌలిక వసతుల కల్పనకు గణనీయమైన పురోగతి సాధించారు. కమిషనర్ చొరవతో కాలనీలో అభివృద్ధి పనులు వేగవంతం కావడంపై విద్యానగర్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ అభిషేక్ అగస్త్యను కలిసి అభినందన పత్రం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని 1, 4వ డివిజన్లలో ఉన్న విద్యానగర్ కాలనీ 2012 నుంచి అభివృద్ధి చెందు తున్నప్పటికీ, చాలాకాలంగా సరైన సీసీ రోడ్లు, డ్రైనేజీ సదుపాయాలు లేక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కాలనీ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 2025 ఆగస్టులో విద్యానగర్ వెల్ఫేర్ సొసైటీని ఏర్పాటు చేసి, సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

కాలనీవాసుల విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు, సంబంధిత అధికారులతో నమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో పనులు వేగంగా జరిగేలా చొరవ తీసుకున్నారు. ఫలితంగా 4వ డివిజన్‌లోని మొత్తం 8 రోడ్లకు సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి. 1వ డివిజన్‌లో మొత్తం 28 రోడ్లకు గాను 14 రోడ్ల పనులు పూర్తికాగా, మరో 3 రోడ్ల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.

ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న కమిషనర్ పనితీరు అభినందనీయమని సొసైటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అభివృద్ధి పనుల రూపంలో కార్యరూపంలోకి తీసుకురావడం ద్వారా ప్రజల్లో అధికారులపై నమ్మకం, భరోసా కల్పించారని కొనియాడారు. అధికారులు బదిలీపై వెళ్లినా ప్రజల జీవితాల్లో తీసుకొచ్చిన సానుకూల మార్పులు చిరకాలం గుర్తుండిపోతాయని అభినందన పత్రంలో పేర్కొన్నారు.

కమిషనర్ అభిషేక్ అగస్త్య భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టి ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యానగర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు బండి నరసింహారావు, ప్రధాన కార్యదర్శి మోతె వెంకన్న, ఇతర సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మధుమేహ బాధితులకు కంటి పరీక్షలు తప్పనిసరి

కరీంనగర్, నవంబర్ 23: మధుమేహ బాధితులకు కంటి పరీక్షలు తప్పనిసరి అని **-ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**



జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సూచించారు.

హైదరాబాద్‌లోని నియో రెటీనా ఐ కేర్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన డయాబెటిక్ రెటినోపతి అవేర్‌నెస్ వాక్ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధుమేహం వల్ల కంటి చూపుపై కలిగే ప్రభావాలు, డయాబెటిక్ రెటినోపతిని ముందస్తుగా గుర్తించడం, క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడం, సకాలంలో చికిత్స పొందడం యొక్క ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. మధుమేహ బాధితులు కంటి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కంటి చూపును కాపాడుకోవడానికి నిరంతర వైద్య పరీక్షలు ఎంతో అవసరమని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

అయ్యప్ప స్వాములకు ఉచిత మెగా వైద్య శిబిరం

ఒకే రోజు 261 మందికి వైద్య పరీక్షలు.. 103 మందికి బీఎండీ, 130 మందికి ఫ్లైబ్రోస్కాన్ పరీక్షలు
వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులతో సేవలు.. ఉచితంగా మందుల పంపిణీ



ఖమ్మం, నవంబర్ 23:అయ్యప్ప స్వాముల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఖమ్మం నగరంలోని శ్రీనివాసనగర్ శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీ శాస్తా దేవస్థానం, శ్రీ అయ్యప్ప అన్నప్రసాద వితరణ బృందం ఆధ్వర్యంలో, జంగాల రాజేశ్వరరావుకు చెందిన సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ సహకారంతో, సాయిరాం హాస్పిటల్స్ భాగస్వామ్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన శిబిరం మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగింది. మొత్తం 261 మంది వైద్య పరీక్షలు చేయించుకుని, వివిధ విభాగాలకు చెందిన నిపుణుల నుంచి ఆరోగ్య సలహాలు పొందారు.

ఈ శిబిరంలో వివిధ వైద్య విభాగాలకు చెందిన తొమ్మిది మంది వైద్య నిపుణులతోపాటు న్యూట్రిషనిస్ట్ పాల్గొని సేవలందించారు. జనరల్ మెడిసిన్, గ్యాస్ట్రోఎంటరాలజీ, డయాబెటాలజీ, ఆర్థోపెడిక్స్, నెఫ్రాలజీ, న్యూరో సైకియాట్రీ, కార్డియాలజీ, సర్జికల్ ఆంకాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ తదితర విభాగాల్లో పరీక్షలు నిర్వహించారు. రోగుల ఆరోగ్య సమస్యలను తెలుసుకుని అవసరమైన వైద్య సూచనలు అందించారు.

డాక్టర్ సునీల్ కుమార్ జంగాల, డాక్టర్ స్వాతి జంగాల, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ కార్తీక్ రెడ్డి, డాక్టర్ వెంకటేష్ పున్న, డాక్టర్ విజేశ్ వర్మ , డాక్టర్ దివ్య రెడ్డి కంది , డాక్టర్ తరుణ్ సాయి వైద్య సేవలందించారు. లాపరో స్కోపిక్, రోబోటిక్ జీఐ సర్జరీ నిపుణుడిగా డాక్టర్ తరుణ్ సాయి సేవలు అందించగా, న్యూట్రిషనిస్ట్ డాక్టర్ భార్గవి శివలంక పోషకాహారంపై సూచనలు ఇచ్చారు.

ఉచితంగా ప్రత్యేక వైద్య పరీక్షలు

శిబిరంలో పలు రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రక్తంలో చక్కెర స్థాయిని తెలుసుకునేందుకు జీఆర్‌బీఎస్ పరీక్షలు, ఎముకల పటిష్టతను అంచనా వేసేందుకు బోన్ మినరల్ డెన్సిటీ (బీఎండీ) పరీక్షలు, కాలేయ ఆరోగ్య పరిస్థితిని గుర్తించేందుకు ఫ్లైబ్రోస్కాన్ పరీక్షలు చేశారు. వీటితోపాటు సీబీపీ, క్రియాటినిన్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఖరీదైన పరీక్షలను ఉచితంగా అందుబాటులోకి తీసుకురావడంపై శిబిరానికి వచ్చిన వారు హర్షం వ్యక్తం చేశారు.

విభాగాల వారీగా చూస్తే గ్యాస్ట్రో మెడిసిన్‌లో 72 మంది, జనరల్ మెడిసిన్‌లో 71 మంది, డయాబెటిక్ విభాగంలో 43 మంది, ఆర్థోపెడిక్ విభాగంలో 51 మంది వైద్య సేవలు పొందారు. కంటి వైద్య విభాగంలో 15 మంది, నెఫ్రాలజీలో నలుగురు, సర్జికల్ ఆంకాలజీలో ఇద్దరు, న్యూరో విభాగంలో ఒకరు, జనరల్ సర్జరీలో ఒకరు, కార్డియాలజీలో ఒకరు, డెర్మటాలజీలో ఒకరు పరీక్షలు చేయించుకున్నారు. మొత్తంగా 261 మంది ఓపీ సేవలను వినియోగించుకున్నారు.

ప్రత్యేక పరీక్షల్లో భాగంగా 103 మందికి బీఎండీ, 130 మందికి ఫ్లైబ్రోస్కాన్ పరీక్షలు నిర్వహించారు. కాలేయ సంబంధిత వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తించేందుకు ఫ్లైబ్రోస్కాన్ పరీక్షలు ఉపయోగపడతాయని, ఎముకల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసేందుకు బీఎండీ పరీక్షలు దోహదపడతాయని వైద్యులు వివరించారు.

ముందస్తు ఆరోగ్య అవగాహనే లక్ష్యం

మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గడం వంటి కారణాలతో మధుమేహం, కాలేయ సంబంధిత సమస్యలు, ఎముకల బలహీనత వంటి ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులపై ముందస్తు అవగాహన కల్పించడం, సమస్య తీవ్రత పెరగకముందే వైద్యులను సంప్రదించేలా ప్రోత్సహించడం ఈ శిబిరం ప్రధాన ఉద్దేశమని వివరించారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు సామాజిక సేవలో భాగంగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. అయ్యప్ప స్వాముల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా వందలాది మందికి వైద్య సేవలు అందాయి. ఉచిత పరీక్షలు, నిపుణుల సలహాలు, మందుల పంపిణీతో శిబిరం విజయవంతంగా ముగిసింది.

పార్వతీపురం మున్సిపల్ పీఠంపై కూటమి జెండా

చైర్‌పర్సన్‌గా బెలగాం కరుణ.. వైస్ చైర్‌పర్సన్‌గా వలిరెడ్డి పార్వతి ఎన్నిక

కరీంనగర్, నవంబర్ 23: పార్వతీపురం పురపాలక సంఘ నూతన పాలకవర్గం కొలువుదీరింది. చైర్‌పర్సన్‌గా టీడీపీకి చెందిన బెలగాం కరుణ, వైస్ చైర్‌పర్సన్‌గా బీజేపీకి చెందిన వలిరెడ్డి పార్వతి ఎన్నికయ్యారు.

సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి కె. హేమలత అధ్యక్షతన, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ బి. రామగోపాల్ బెలగాం కరుణతో చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం 36 వార్డుల కౌన్సిలర్లతో ప్రమాణం చేయించారు.తదుపరి వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. బీజేపీ తరఫున వలిరెడ్డి పార్వతి పేరును రెండో వార్డు సభ్యుడు గేదెల రామారావు ప్రతిపాదించగా, 34వ వార్డు సభ్యుడు పాలకొండ రాజశేఖర్ బలపరిచారు. ఇతరుల నుంచి ఎలాంటి ప్రతిపాదనలు, పోటీ లేకపోవడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. అనంతరం ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు.

కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.



అమెరికాపై ఇరాన్ యుద్ధ హెచ్చరికలు.. సైనిక స్థావరాలే టార్గెట్!

న్యూ ఢిల్లీ, నవంబర్ 23: అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా కొనసాగిస్తున్న నౌకాదళ దిగ్బంధనంపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఈ చర్యను సైనిక దురాక్రమణగా అభివర్ణించిన ఇరాన్.. దాన్ని ఎదుర్కొనేందుకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలనూ వినియోగిస్తామని స్పష్టం చేసింది. అవసరమైతే సైనిక చర్యలకు దిగే అవకాశాన్ని కూడా తోసిపుచ్చడం లేదు. మరోవైపు దిగ్బంధనాన్ని ఉల్లంఘించే ఇరాన్ నౌకలను సముద్రంలో ముంచేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఒప్పందం కుదరకపోతే కొత్త ఏడాది తర్వాత మళ్లీ సైనిక దాడులు ప్రారంభించే అవకాశముందని సంకేతాలిచ్చారు. హోర్ముజ్ జలసంధిలో నౌకల కదలికలు, దాడులు, అమెరికా సైనిక బలగాల మోహరింపుతో పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ భయాలు నెలకొన్నాయి.

ఇరాన్ చమురు ఎగుమతులను లక్ష్యంగా చేసుకుని అమెరికా విధించిన నౌకాదళ దిగ్బంధనం ఆ దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇరాన్ చమురు ఎగుమతులు దాదాపుగా నిలిచిపోయిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో దిగ్బంధనాన్ని సహించబోమని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ సోమవారం స్పష్టం చేశారు.

అమెరికా చర్యలను సైనిక దురాక్రమణగా అభివర్ణించిన ఆయన.. తమ దేశానికి ఆత్మరక్షణ హక్కు ఉందని పేర్కొన్నారు. దిగ్బంధనాన్ని ఎదుర్కొనేందుకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలనూ వినియోగిస్తామని హెచ్చరించారు. అమెరికా ఆంక్షలు, నౌకాదళ దిగ్బంధనం తమపై ఆర్థిక ఒత్తిడి మాత్రమే కాదని, సైనిక చర్యతో సమానమని ఇరాన్ వాదిస్తోంది.ఇరాన్‌కు సంబంధించిన చమురు ఎగుమతులపై అమెరికా దిగ్బంధనం ఏప్రిల్ 13న ప్రారంభమైంది. జూన్‌లో ఇరు దేశాల మధ్య అవగాహన ముసాయిదా రూపుదిద్దుకోవడంతో తాత్కాలికంగా నిలిచిపోయింది. అయితే చర్చలు విఫలం కావడంతో జూలై 14న మళ్లీ దిగ్బంధనం అమల్లోకి వచ్చింది. దీంతో ఇటీవలి నెలల్లో ఇరాన్ ముడిచమురు ఎగుమతులు దాదాపు సున్నాకు పడిపోయాయి.

వెండితెరను దాటి అక్షర రూపంలోకి: భారత సినీ వారసత్వాన్ని పుస్తక పుటలపైకి తెస్తున్న ఇఫీ 2026

న్యూ ఢిల్లీ, నవంబర్ 23:తరతరాల ఆలోచనలను ఆకట్టుకునే సినిమా సమాజానికి అద్దం పడుతూ, జ్ఞాపకాలను భద్రపరుస్తూ, సాంస్కృతిక గుర్తింపులను నిర్మిస్తుంది. తెరపై కనిపించే దృశ్యాలే కాకుండా, సినీ రంగాన్ని తీర్చిదిద్దిన భావాలు, సృజనాత్మక ప్రయాణాలను గ్రంథస్థం చేయడంలో పుస్తకాల పాత్ర కూడా ఎంతో కీలకం. దీని ప్రాముఖ్యతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వ ప్రచురణల విభాగం (పబ్లికేషన్స్ డివిజన్) భారతీయ సినిమా వారసత్వంలోని భిన్న పార్శ్వాలను ఆవిష్కరిస్తూ 57వ ఇఫీ - 2026లో రెండు పుస్తకాలను విడుదల చేసింది.

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ చంచల్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, చిత్ర నిర్మాణం వెనుక ఉన్న సృజనాత్మక ప్రయాణాలను అక్షరబద్ధం చేయడం, భారతదేశ సుసంపన్నమైన సినీ వారసత్వాన్ని భావితరాల కోసం పదిలపరచడం ఎంతో అవసరమని అన్నారు. సినిమా కేవలం వినోద మాధ్యమం మాత్రమే కాదని, అది సమాజానికి, వివిధ తరాల స్ఫూర్తికి, మారుతున్న ఆలోచనలకు ప్రతిబింబమని ఆయన అభిప్రాయపడ్డారు. "సినిమాలు మనకు ఒక కథను చెబుతాయి. ఆ కథలు వెండితెరపై ఎలా ప్రాణం పోసుకున్నాయో అర్థం చేసుకోవడానికి సినిమా పుస్తకాలు సహాయపడతాయి" అని ఆయన పేర్కొన్నారు. చిత్రనిర్మాతల అనుభవాలు, సినీ సాంకేతిక పరిణామం, భారతీయ సినిమాను తీర్చిదిద్దిన ఆలోచనలపై ఇటువంటి ప్రచురణలు విలువైన అంతర్దృష్టిని అందిస్తాయని ఆయన వివరించారు.

విడుదల చేసిన రెండు పుస్తకాల్లో మొదటిది శ్రీ రాజేంద్ర భట్ సంకలనం చేసిన 'సినిమా: వివిధ్ ఆయామ్'. రెండోది శ్రీ వినోద్ కౌల్ రచించిన 'అవతార్ కౌల్: ది (ఇన్)కంప్లీట్ స్టోరీ'. సినిమాకు సంబంధించిన ముఖ్యమైన రచనలు, విభిన్న దృక్పథాలను ఒకచోట చేర్చి, హిందీ పాఠకులకు అందుబాటులోకి తీసుకురావడం మొదటి పుస్తకం ప్రత్యేకత. ప్రముఖ సినీ దర్శకుడు అవతార్ కౌల్ జీవితం, అనంపూర్తిగా మిగిలిపోయిన ఆయన సృజనాత్మక వారసత్వాన్ని రెండో పుస్తకం నమోదు చేస్తుంది.

'సినిమా: వివిధ్ ఆయామ్' పుస్తకం గురించి ప్రస్తావిస్తూ, ప్రముఖ చిత్రాలు, చిత్ర నిర్మాణ ప్రక్రియ, ప్రపంచ సినిమా వంటి అంశాలపై సినీ దర్శకులు, పరిశోధకులు రాసిన వ్యాసాలను ఒకచోట చేర్చడాన్ని శ్రీ చంచల్ కుమార్ అభినందించారు. ఈ రచనలను హిందీ పాఠకులకు అందుబాటులోకి తీసుకురావడానికి చేసిన కృషిని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. 'అవతార్ కౌల్: ది (ఇన్)కంప్లీట్ స్టోరీ' పుస్తకం గురించి మాట్లాడుతూ, ప్రముఖ సినీ దర్శకుడు అవతార్ కౌల్ వారసత్వాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. అవతార్ కౌల్ దర్శకత్వం వహించిన ఏకైక చిత్రం '27 డౌన్' (1974), భారతీయ న్యూ వేవ్ సినిమా చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు.

ఈ పుస్తకాలను ప్రచురించిన ప్రచురణల విభాగానికి, ప్రచురణలో భాగస్వాములైన శ్రీ రాజేంద్ర భట్, శ్రీ వినోద్ కౌల్ తదితరులకు కార్యదర్శి అభినందనలు తెలిపారు. ఈ పుస్తకాలు విద్యార్థులు, సినీ దర్శకులు, చలనచిత్రాభిమానులకు భారతీయ సినిమా వారసత్వాన్ని మరింత లోతుగా అన్వేషించేందుకు స్ఫూర్తినిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రచురణల విభాగం డైరెక్టర్ జనరల్ శ్రీమతి కాంచన్ ప్రసాద్ మాట్లాడుతూ, భారతీయ సినిమాతో ప్రచురణల విభాగానికి ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని, దేశ సాంస్కృతిక, సృజనాత్మక వారసత్వాన్ని పత్రాల రూపంలో భద్రపరచడంలో అది పోషిస్తున్న పాత్రను వివరించారు. సినిమా కాలగమనంలో కొన్ని క్షణాలను తెరపై ఆవిష్కరిస్తే, పుస్తకాలు వాటిని శాశ్వతంగా పదిలపరుస్తాయని ఆమె పేర్కొన్నారు. సృజనాత్మక ప్రయాణాలను నమోదు చేయడం, కథలను భద్రపరచడం, భారతీయ సాంస్కృతిక గుర్తింపును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన వారి కృషిని గౌరవించడం వంటి లక్ష్యాలతో ప్రచురణల విభాగం చేస్తున్న ప్రయత్నాలను ఆమె వివరించారు.

'సినిమా: వివిధ్ ఆయామ్' పుస్తకం రూపకల్పన వెనుక సంపాదక ప్రక్రియ గురించి శ్రీ రాజేంద్ర భట్ వివరించారు. సినిమాపై వెలువడిన ముఖ్యమైన రచనలను హిందీ పాఠకులకు అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచనను ప్రచురణల విభాగం ఏ విధంగా ముందుకు తీసుకెళ్లిందో ఆయన వివరించారు.

ఈ కార్యక్రమానికి పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) డైరెక్టర్ జనరల్ శ్రీమతి స్మితా వత్స శర్మ సమన్వయకర్తగా వ్యవహరించారు. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ ప్రభాత్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ కె.కె. నిరాలా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రీ వినోద్ కౌల్ ఆంగ్లంలో రచించిన ఈ పుస్తకం చిత్ర దర్శకుడు అవతార్ కౌల్ జీవితాన్ని, అనంపూర్తిగా మిగిలిపోయిన ఆయన సృజనాత్మక వారసత్వాన్ని అక్షరబద్ధం చేసింది. ఆయన రాసిన లేఖలు, ఛాయాచిత్రాలు, జ్ఞాపకాలు, సంభాషణల ఆధారంగా ఈ పుస్తకాన్ని రూపొందించారు. ఆయన దర్శకత్వం వహించిన ఏకైక చిత్రం '27 డౌన్' (1974) భారతీయ న్యూ వేవ్ సినిమా చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. ఈ చిత్రానికి జాతీయ చలనచిత్ర పురస్కారం కూడా లభించింది. అయితే, ఆ పురస్కారాన్ని ప్రకటించిన రోజే ఒక విషాద సంఘటన చోటుచేసుకుంది. స్నేహితుడిని కాపాడే ప్రయత్నంలో ముంబైలో సముద్రంలో మునిగి, 34 ఏళ్ల వయసులో అవతార్ కౌల్ ప్రాణాలు కోల్పోయారు.

భాషలు.. ఎల్లలకు అతీతం: 57వ 'ఐఐఎఫ్ఐ'లో భారతీయ సినిమా వైవిధ్యానికి ఇండియన్ పనోరమా నీరాజనం

న్యూ ఢిల్లీ, నవంబర్ 23: దక్షిణ భారతం నుంచి ఈశాన్యం దాకా వైవిధ్యభరిత కథలు, సంస్కృతులు, సృజనాత్మక వ్యక్తీకరణలతోనే భారతీయ సినిమా నానాటికీ బలం పుంజుకుంటోంది. అయినప్పటికీ ప్రాంతీయ అస్తిత్వాలు, విభిన్న సినీ శైలులకు అతీతంగా యావద్దేశ ప్రేక్షకులను ఈ కథలతో మమేకం చేసేది వాటిలో ఉట్టిపడే సార్వజనీన మానవీయ భావోద్వేగాలే. ఈ వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తూ ప్రముఖ దర్శకుడు మాధుర్ భండార్కర్ నేతృత్వంలోని 'ఇండియన్ పనోరమా-2026' ఫీచర్ ఫిల్మ్ న్యాయ నిర్ణేతల సంఘం భారత 57వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫీ) వేదికగా ఇవాళ విలేకరుల సమావేశం నిర్వహించింది. ఈ వేడుకలకు వచ్చిన 404 ఎంట్రీల నుంచి 25 చిత్రాల ఎంపికలో తమ అనుభవాలను పాత్రికేయులతో పంచుకుంది.

విభిన్న కళాభిరుచులతో రూపొందిన చిత్రాలన్నింటినీ జ్యూరీ సభ్యులంతా వీక్షించిన తర్వాత ఏకాభిప్రాయంతో తుది జాబితాను ఖరారు చేసినట్లు భండార్కర్ తెలిపారు. ఈ అనుభవం ఎంతో సుసంపన్నమని, కొత్త అంశాలపై అవగాహనకు, నవ్య దృక్కోణాల స్వీకరణకు చలనచిత్రోత్సవాలు వేదికలుగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. తుది ఎంపికపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తూ- కొన్ని మరాఠీ, లద్దాఖీ, మలయాళ చిత్రాలు తమ బృందంపై బలమైన ముద్ర వేశాయని, అవి ప్రేక్షకులను మంత్రముగ్ధం చేసేలా రూపొందాయని ప్రత్యేకంగా ప్రశంసించారు.

కథల్లోని సహజత్వం, ప్రాంతీయతల ప్రాధాన్యాన్ని జ్యూరీ సభ్యురాలు, సీనియర్ కాలమిస్ట్ భారతి ప్రధాన్ వివరించారు. దేశవ్యాప్త దృక్కోణాలను ఏకతాటిపైకి తెస్తూనే, తమ వాస్తవ దృక్పథాన్ని స్పష్టంగా చాటుకునే చిత్రాలకే తాము ప్రాముఖ్యమిచ్చామని ఆమె పేర్కొన్నారు. ఎంపికైన జాబితాలోని చిత్రాల్లో అఖిల భారత స్థాయి ప్రస్ఫుటం కావడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, 'ఇండియన్ పనోరమా ఫీచర్ ఫిల్మ్' విభాగంతో పోల్చినపుడు 'మెయిన్‌స్ట్రీమ్ సినిమా' విభాగంలోని చిత్రాల ఎంపిక ప్రమాణాలు భిన్నంగా ఉంటాయని స్పష్టం చేశారు.

దేశంలోని వివిధ ప్రాంతాల చిత్రాలు అంతర్జాతీయ సినిమాల వీక్షణానుభూతిని కలిగించాయని నటి, జ్యూరీ సభ్యురాలు బిందు చంద్రమౌళి అన్నారు. భాషలు, శైలులు, జానర్లలో భిన్నత్వం నిజమే అయినా, వాటన్నింటినీ కలిపే అంతర్లీన భావోద్వేగాల సూత్రం ఒక్కటేనని ఆమె విశ్లేషించారు. ప్రేక్షకులు తమ భాషా పరిమితులకు అతీతంగా సినిమాలను ఆదరించాలని సూచించారు. భిన్న భాషా చిత్రాలను, విభిన్న కథన శైలులను ఆస్వాదించడంలో తెలుగు ప్రేక్షకులు సదా సిద్ధంగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు.

ఈ ఎంపిక ప్రక్రియ భారతీయ 'భిన్నత్వంలో ఏకత్వాన్ని' ప్రతిబింబించే వర్చువల్ భారత యాత్రలా సాగిందని ఛాయాగ్రాహకుడు, జ్యూరీ సభ్యుడు ఎం.ఎస్.ప్రభు అభివర్ణించారు. వివిధ ప్రాంతాల సినిమాలను చూస్తున్న కొద్దీ ఆ కథలు, అవి పలికించే భావోద్వేగాల మధ్య గల అనుబంధం మరింత స్పష్టమైందని తెలిపారు. కొత్త దర్శకుల ప్రతిభను అభినందిస్తూ- ఈ ఎంపిక ప్రక్రియ తనకొక విలువైన అభ్యసనానుభవమని పేర్కొన్నారు.

చిత్రాల ఎంపికపై ఛాయాగ్రాహకుడు, జ్యూరీ సభ్యుడు కె.ఎస్.శివరామన్ స్పందిస్తూ- కొన్ని కథల్లోని భావోద్వేగాలు ఎంతగానో హత్తుకున్నాయన్నారు. వాటిలో కొన్నింటిని దక్షిణాది ప్రేక్షకుల కోసం పునర్నిర్మించాలన్న ఆలోచన కూడా తనలో కలిగిందన్నారు. ఎంపిక ప్రక్రియ సందర్భంగా సినిమాలోని సందేశానికి తామెంతో ప్రాధాన్యమిచ్చామని మరో జ్యూరీ సభ్యుడు సోహమ్ పి.షా తెలిపారు.

మెయిన్‌స్ట్రీమ్ సినిమా విభాగంలోని ఐదు చిత్రాల ఎంపికపైనా జ్యూరీ చర్చించింది. సినిమాల సత్తా, ఇతివృత్తాలు, వాటిలోని వినూత్న ఆలోచనల ఆధారంగా సమష్టి నిర్ణయంతోనే వాటిని ఎంపిక చేశామని భండార్కర్ వివరించారు. ఈ విలేకరుల సమావేశానికి శ్రీ రజిత్ చంద్రన్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

ఎంపిక చేసిన ఫీచర్ ఫిల్మ్ జాబితాలో 'ఇండియన్ పనోరమా ఫీచర్ ఫిల్మ్' విభాగంలోని 20, 'మెయిన్‌స్ట్రీమ్ సినిమా' విభాగంలోని 5 చిత్రాలున్నాయి. 'ఇండియన్ పనోరమా-2026' ప్రారంభ చిత్రంగా ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన హిందీ చిత్రం 'ధురంధర్' ఎంపికైంది. వీటితోపాటు విస్తృత ఇండియన్ పనోరమా ఎంపికలో 20 నాన్-ఫీచర్ చిత్రాలు కూడా ఉన్నాయి.

ప్రేక్షకుల మనోభావాలను స్పృశించే కథల ద్వారా ప్రాంతీయ అస్తిత్వాలు, విభిన్న సినీ శైలులు ఏకమయ్యే తీరును జ్యూరీ సభ్యుల అభిప్రాయాలు స్పష్టం చేశాయి. ఇఫీ వేదికగా 'ఇండియన్ పనోరమా' ఈ వైవిధ్యాన్ని నిరంతరం వెలుగులోకి తెస్తోంది. తద్వారా భాషలు, సంస్కృతులకు అతీతంగా సమకాలీన భారతీయ సినిమాలతో మమేకం కావడానికి, ఆస్వాదనకు విశిష్ట వేదికగా నిలుస్తోంది.

జీవితానికి అర్థం చెప్పేది హాస్యం - ఐఎఫ్ఎఫ్ఐ 57లో ప్రపంచ ప్రీమియర్‌గా ప్రదర్శితమైన స్పెయిన్ చిత్రం 'లుకింగ్ ఫర్ మైఖేల్'

న్యూ ఢిల్లీ, నవంబర్ 23:జీవితంలోని కష్టాలను చిరునవ్వుతో ఎదుర్కొంటే ఎలా ఉంటుంది? స్పెయిన్‌కు చెందిన 2026 హాస్య, భావోద్వేగ ప్రధాన చిత్రం 'లుకింగ్ ఫర్ మైఖేల్' (పెర్సిగుయెండో ఎ మైఖేల్) ఈ ప్రశ్నకు హృద్యమైన కథనం ద్వారా సమాధానమిస్తుంది. జువానా మాసియాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ధైర్యం, స్నేహం, మనోధైర్యం వంటి అంశాలను ఆవిష్కరిస్తుంది. గోవాలోని పనాజీలో జరుగుతున్న 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ)లో ఈ చిత్రం నేడు తొలిసారిగా ప్రపంచ ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

ఈ సినిమా పార్కిన్సన్స్ వ్యాధితో బాధపడుతున్న సోనియా అనే యువతి కథను ఆవిష్కరిస్తుంది. పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవాలని, జీవితాన్ని కొత్త దృక్పథంతో చూడాలని ఆమె నిర్ణయించుకుంటుంది. అదే వ్యాధితో జీవిస్తున్న తన సంగీత చికిత్సా బృందంలోని సభ్యుల సహకారంతో, పార్కిన్సన్స్ వ్యాధితో జీవిస్తున్న విషయాన్ని బహిరంగంగా వెల్లడించిన ప్రముఖ నటుడు మైఖేల్ జె. ఫాక్స్‌ను కలుసుకునేందుకు ఆమె ప్రయాణం ప్రారంభిస్తుంది. సంగీతం, హాస్యాన్ని మేళవిస్తూ సాగే ఈ ప్రయాణ కథా చిత్రం, ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా జీవితాన్ని తమకు నచ్చిన విధంగా, తమదైన శైలిలో సాగించాలన్న సంకల్పాన్ని ప్రతిబింబిస్తుంది.

ముప్పై ఏళ్ల వయసు దాటిన తొలినాళ్లలోనే పార్కిన్సన్స్ వ్యాధి బారినపడిన యెస్ ఆండ్రెజ్ అనే మహిళ నిజ జీవిత ప్రయాణం, ఆమె కల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఆమె వ్యక్తిగత అనుభవాలు ఈ కథనానికి ఆత్మీయతను, సహజత్వాన్ని అద్దాయి. నిత్యజీవితంలోని సంఘటనలను నిశితంగా పరిశీలించి తెరకెక్కించడం వల్ల కథనంలో భావోద్వేగవరవైన నిజాయతీ ప్రతిబింబిస్తుంది. తద్వారా పాత్రలు ఎదుర్కొనే సవాళ్లు, వారి ఆశయాలు ప్రేక్షకుల కళ్లకు కట్టినట్లు తెరపై ఆవిష్కృతమవుతాయి.

ఈ చిత్ర ప్రదర్శన సందర్భంగా ఏర్పాటయిన కార్యక్రమంలో చిత్ర దర్శకురాలు జువానా మాసియాస్ మాట్లాడుతూ, ''జీవితాన్ని అర్థం చేసుకునేందుకు హాస్యం ఒక తెలివైన మార్గం'' అని పేర్కొన్నారు. అనారోగ్యం, అత్యంత ఆత్మీయులైన వారిని కోల్పోవడం లేదా అనుకోని ఇతర సమస్యల రూపంలో ప్రతి ఒక్కరూ జీవితంలో ఏదో ఒక దశలో కష్టాలను ఎదుర్కొంటారని ఆమె అన్నారు. ఈ అనుభవాలు అందరికీ సాధారణమే కావడంతో ఈ చిత్రానికి విస్తృతమైన ఆదరణ లభిస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. దేశాల సరిహద్దులు, తరాల అంతరాలకు అతీతంగా ప్రేక్షకుల హృదయాలను తాకేలా ఈ చిత్రం ప్రధాన సందేశం ఉంటుందని, ఇది 57వ ఐఎఫ్ఎఫ్ఐ ఇతివృత్తానికి కూడా అనుగుణంగా ఉందని ఆమె పేర్కొన్నారు

డోరిస్ పాత్రలో నటించిన లోరెనా లోపెజ్ మాట్లాడుతూ, ఆ పాత్రలోని మనోధైర్యం, ఉత్సాహభరితమైన వ్యక్తిత్వం, సోనియాతో ఉన్న స్నేహబంధం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. సోనియా పాత్రను నూరియా హెరెరో పోషించారు. వీల్‌చైర్ ఉపయోగించే డోరిస్ సోనియా ప్రయాణంలో స్నేహితురాలిగానే కాకుండా మార్గదర్శిగా కూడా నిలుస్తుంది. జీవితంలోని సవాళ్లను ఎదుర్కోవడంలో తోడుగా నిలిచే స్నేహం, పరస్పర సహకారం ఎంత ముఖ్యమో ఈ పాత్ర ద్వారా చిత్రం చాటిచెబుతుంది.

నటీనటుల నుంచి సహజమైన నటనను రాబట్టేందుకు తాను అనుసరించిన విధానం గురించి కూడా మాసియాస్ వివరించారు. రిహార్సల్స్‌తో పాటు చిత్రీకరణ సమయంలో కూడా నటీనటులను అక్కడికక్కడే తమదైన రీతిలో సంభాషణలు, హావభావాల మెరుగుదలకు ప్రోత్సహించినట్లు తెలిపారు. ముఖ్యంగా హాస్య చిత్రాల్లో ఈ పద్ధతి ఎంతో ఉపయోగకరమని, పాత్రల మధ్య సహజమైన సంబంధాలు, పరస్పర సంభాషణలు రూపుదిద్దుకునేందుకు దోహదపడుతుందని ఆమె పేర్కొన్నారు.

చిత్రంలో సంగీతం ప్రాధాన్యత గురించి వివరిస్తూ, సోనియా తన అనారోగ్య పరిస్థితితో క్రమంగా ఎలా సర్దుకుపోతోందో పాటల ద్వారా ప్రతిబింబించామని మాసియాస్ తెలిపారు. పాత్రల భావోద్వేగాలు, అనుభవాలతో పాటలను విడదీయలేని విధంగా మేళవించినట్లు వివరించారు. చిత్రం ప్రారంభంలో వచ్చే పాటను ప్రస్తావిస్తూ, తన ఆరోగ్య పరిస్థితిని అదుపులో ఉంచుకోవడానికి సోనియా ప్రతిరోజూ ఎనిమిది మాత్రలు వేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. నిత్యజీవితంలో ఆమె ఎదుర్కొనే ఈ వాస్తవాన్ని సంగీతం ద్వారా చిత్రంలోని భావోద్వేగ కథనంలో భాగం చేశామని ఆమె వివరించారు.

చిత్రం కోసం చేసిన పరిశోధన గురించి మాసియాస్ మాట్లాడుతూ, యెస్ ఆండ్రెజ్‌తో పాటు పార్కిన్సన్స్ వ్యాధితో జీవిస్తున్న పలువురిని తాను విస్తృతంగా ఇంటర్వ్యూ చేసినట్లు తెలిపారు. వారి కథలను తెరపై ఆవిష్కరించేటప్పుడు, వారు ఎదుర్కొంటున్న పరిస్థితులు, అనుభవాలను నిజాయతీగా, సహజత్వంతో అర్థం చేసుకోవడం ఎంతో అవసరమని ఆమె స్పష్టం చేశారు.

స్పానిష్ సినిమాలు భారతీయ, అంతర్జాతీయ ప్రేక్షకులకు ఏ విధంగా చేరువ కాగలవన్న ప్రశ్నకు సమాధానమిస్తూ, సంగీతానికి, ప్రతికూల పరిస్థితులను అధిగమించే కథలకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ ఉంటుందని మాసియాస్ అభిప్రాయపడ్డారు. మరింత విస్తృతమైన ప్రేక్షకులకు తమ చిత్రాలను చేరువ చేసేందుకు స్పెయిన్‌తో పాటు అంతర్జాతీయ ఓటీటీ వేదికలతో కలిసి పనిచేసే ప్రణాళికలు కూడా ఉన్నాయని ఆమె వెల్లడించారు.

ఐఎఫ్ఎఫ్ఐలో ఈ చిత్రాన్ని తొలిసారిగా ప్రపంచ ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం ద్వారా భౌగోళిక, సాంస్కృతిక సరిహద్దులను అధిగమించే ఒక కథను చలనచిత్రోత్సవానికి పరిచయం చేసినట్లయింది. జీవితంలోని అనిశ్చితులను ఎదుర్కోవడంలో హాస్యం, సంగీతం, మానవ సంబంధాలకు ఉన్న అపారమైన శక్తిని ఈ చిత్రం ప్రేక్షకులకు స్పష్టం చేస్తుంది.

ఈ కార్యక్రమానికి శ్రీ కుల్దీప్ మీనా సమన్వయకర్తగా వ్యవహరించారు.

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే గంద్ర

ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం కింద లబ్ధిదారులకు ఇన్సూరెన్స్ పత్రాల పంపిణీ



నల్గొండ, నవంబర్ 23: పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గంద్ర సత్యనారాయణరావు అన్నారు.

సోమవారం మండలంలోని కొత్తపేట, రామచంద్రపురం, చింతకుంట రామయ్యపల్లి, ఏలేటి రామయ్యపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, లబ్ధిదారులకు బీమా పత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం పలు పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.కార్యక్రమంలో తహసీల్దార్ వసంతరావు, ఎంపీడీఓ జయశ్రీ, ఆయా గ్రామాల సర్పంచులు ఉమ్మనబోయిన పద్మ, గాజే హేమలత, మటిక సుజాత, కొడారి అశోక్, గుంటుపల్లి నాగమల్లేశ్వరరావు, కొడారి ఓదెలు, పార్లపల్లి రవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దబ్బెట అనిల్, నాయకులు పింగిలి జ్యోతి, బుర్ర శ్రీనివాస్, అల్లకొండ కుమార్, చిలుకల రాయ కొమురు, గడ్డం కొమరయ్య, కట్కూరి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో సమయపాలన పాటించని అధికారులు

ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇష్టారాజ్యంగా రాకపోకలు

29 శాఖలకు గాను సగం మంది కూడా హాజరుకాని వైనం



నిజామాబాద్, సెప్టెంబర్ 23:ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా అధికారులు తమ వంతు కృషి చేస్తున్నారు. అయితే పలువురు అధికారులు ఈ బృహత్తర కార్యక్రమాన్ని నీరుగారుస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజావాణి కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతోంది. జుక్కల్ మండల కేంద్రంలో ఎంపీడీఓ, ఎంఆర్ఓ, ఎంపీఓలు ఉదయం 10 గంటలకు కార్యక్రమానికి హాజరవుతుండగా, ఆయా శాఖలకు చెందిన అధికారులు మాత్రం 11, 12 గంటలకు, కార్యక్రమం ముగిసే సమయానికి కూడా చుట్టపు చూపుగా వచ్చి హాజరు వేసుకుంటున్నట్లు తెలుస్తోంది. రాని అధికారులకు ఫోన్ చేసి రావాల్సిందిగా ఎంపీడీఓ కోరాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు సమాచారం.

మొత్తం 29 శాఖలు ఉండగా, అందులో కేవలం 15 శాఖల అధికారులు మాత్రమే హాజరవుతున్నట్లు తెలుస్తోంది. వారు కూడా సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా వస్తూ, పోతూ ఉండటం విశేషం. కొన్ని శాఖల అధికారులు వచ్చిన వెంటనే తమ శాఖలో పని ఉందని, సమావేశం ఉందని చెప్పి వెళ్లిపోతున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రజావాణి కార్యక్రమంలో ఆయా శాఖల జవాబుదారీతనం లేకుండా పోయింది. ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటివరకు 13 ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించగా, ఆయా శాఖలకు చెందిన 25 దరఖాస్తులు వచ్చాయని, వాటన్నింటినీ పరిష్కరించామని జుక్కల్ ఎంపీడీఓ బి. శ్రీనివాస్ తెలిపారు.

కుల సంఘాల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు

ప్రతి గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి: ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



నిజామాబాద్, సెప్టెంబర్ 23:కుల సంఘాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం భగీరథపల్లి గ్రామంలో రూ.20 లక్షల సొంత నిధులతో చేపట్టనున్న ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి కుల సంఘంలోని సభ్యులు ఐక్యంగా ఉంటూ తమ సంఘాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కుల సంఘాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో ఎవరికైనా ఎలాంటి సమస్య ఎదురైనా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రతి గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో కుల సంఘాల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు కేటాయించామని, భవిష్యత్తులోనూ మరిన్ని నిధులు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.

కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నరసింహులు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రమేష్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డాక్యుమెంటరీ చిత్ర నిర్మాణం ఒక ఆత్మీయ ప్రక్రియ: నమ్మకం, నైతిక విలువలు, సామాజిక బాధ్యతపై ఇఫి 57లో దర్శకురాలు జూలీ బెర్టుసెల్లి

న్యూ ఢిల్లీ, నవంబర్ 23:డాక్యుమెంటరీ చిత్ర నిర్మాణం... కేవలం వాస్తవాలను చిత్రీకరించడం మాత్రమే కాదు.. ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడం, వారి జీవితానుభవాలను అర్థం చేసుకోవడం, వారి జీవితాలను తెరపై ఎలా చూపిస్తున్నామనే విషయంలో బాధ్యత వహించడం కూడా ఇందులో భాగమే. ఒకవైపు వినిపించని గొంతులను, కఠిన వాస్తవాలను డాక్యుమెంటరీ సినిమా ప్రేక్షకులకు దగ్గర చేస్తుండగా, మరోవైపు నిజ జీవితాలను చిత్రీకరించేటప్పుడు కళాత్మక స్వేచ్ఛ, గోప్యత, నైతిక బాధ్యత వంటి ముఖ్యమైన ప్రశ్నలు కూడా తలెత్తుతాయి.

57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫి) సందర్భంగా పనాజీలోని కళా అకాడమిలో 'ఫ్రమ్ విట్‌నెస్ టు చేంజ్: ది సోషల్ రెస్పాన్సిబిలిటీ ఆఫ్ డాక్యుమెంటరీ సినిమా' (సాక్షి నుంచి మార్పు వరకు: డాక్యుమెంటరీ సినిమా సామాజిక బాధ్యత) అనే అంశంపై నిర్వహించిన ప్రత్యేక ముఖాముఖి చర్చలో ఈ ప్రశ్నలే ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి. ప్రముఖ ఫ్రెంచ్ చిత్ర దర్శకురాలు, కథా రచయిత జూలీ బెర్టుసెల్లి ఈ కార్యక్రమంలో జాతీయ అవార్డు గ్రహీత, భారతీయ చిత్రనిర్మాత హమోబమ్ వబన్ కుమార్‌తో సంభాషించారు.

డాక్యుమెంటరీ చిత్ర నిర్మాణాన్ని ఒక అత్యంత ఆత్మీయమైన ప్రక్రియగా బెర్టుసెల్లి అభివర్ణించారు. సినిమాలు వాటిలోని పాత్రల జీవితాలపై లోతైన ప్రభావాన్ని చూపుతాయని, కొన్ని సందర్భాల్లో వారిని ప్రమాదంలోకి కూడా నెట్టవచ్చని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని పెంచుకోవడం, ఆయా వర్గాలతో సమయం గడపడం, కెమెరా సమక్షంలో వారు సౌకర్యవంతంగా ఉండేలా చేయడం చాలా ముఖ్యమని ఆమె చెప్పారు. ప్రజలను వారి రోజువారీ పరిసరాల్లో గమనించడం ద్వారా తమను తాము ఎలా చూసుకుంటారు, సమాజం తమని ఎలా చూడాలని కోరుకుంటారనే విషయాలను చిత్రనిర్మాతలు అర్థం చేసుకోవడానికి వీలవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.

సామాజిక మార్పును ప్రభావితం చేసే సినిమా సామర్థ్యంపై స్పందిస్తూ.. సినిమాలు రాత్రికి రాత్రే సమాజాన్ని మార్చలేకపోవచ్చు కానీ, వ్యక్తుల ఆలోచనా దృక్పథాలను తీర్చిదిద్దే మార్పును ప్రోత్సహించగలవని బెర్టుసెల్లి అన్నారు. "కొంతమంది ఆలోచనల్లో నేను ఒక చిన్న ఆలోచనా బీజాన్ని నాటగలిగితే, అదే ఎంతో గొప్ప విషయం" అని ఆమె వ్యాఖ్యానించారు. ఆశను రేకెత్తించే, సానుకూల ఉదాహరణలను చూపించే చిత్రాలనే తాను ఇష్టపడతానని, అవి మార్పు సాధ్యమేనని ప్రజలు నమ్మేలా స్ఫూర్తినిస్తాయని ఆమె తెలిపారు.

తన సృజనాత్మక ప్రక్రియ గురించి వివరిస్తూ.. ఆసక్తిని రేకెత్తించే ఊహించని పరిచయాలు, ప్రదేశాలు లేదా అంశాల నుంచే తరచుగా డాక్యుమెంటరీ ఆలోచనలు పుట్టుకొస్తాయని బెర్టుసెల్లి వివరించారు. తన చిత్రాలైన స్కూల్ ఆఫ్ బాబెల్, సిన్స్ ఓతార్ లెఫ్ట్‌లను ప్రస్తావిస్తూ.. నిజ జీవిత అనుభవాలే తన సినిమాలకు తరచుగా కేంద్ర బిందువుగా నిలుస్తాయని ఆమె పేర్కొన్నారు. నిధుల సేకరణ కోసం స్క్రిప్ట్‌లు, ప్రతిపాదనలు అవసరమైనప్పటికీ, అసలు చిత్రనిర్మాణ ప్రక్రియ మాత్రం నిజ జీవితంలోని ఊహించని మలుపులకు అనుగుణంగా సాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

తన సినీ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ.. క్రిజ్‌టోఫ్ కీస్లోవ్‌స్కీ, రిథీ పాన్, బెర్ట్రాండ్ టావెర్నియర్ వంటి ప్రముఖ దర్శకుల వద్ద దాదాపు 15 ఏళ్ల పాటు సహాయ దర్శకురాలిగా పనిచేసినట్లు బెర్టుసెల్లి తెలిపారు. ఈ క్రమంలో రష్యా, జార్జియా, కంబోడియా వంటి దేశాల్లో పనిచేసే అవకాశం లభించిందని, అక్కడి విభిన్న సంస్కృతులు, సినిమా నిర్మాణ పద్ధతుల గురించి ఎన్నో అనుభవాలు పొందానని చెప్పారు.

తన గ్రామంలో అంటరానితనం, పితృస్వామ్యం వంటి సున్నితమైన సామాజిక అంశాలపై డాక్యుమెంటరీ తీయాలనుకుంటున్న యువ దర్శకుడు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. ప్రజల నమ్మకాన్ని పొందడం, వారితో నిరంతరం సంబంధాలు కొనసాగించడం చాలా ముఖ్యమని బెర్టుసెల్లి చెప్పారు. డాక్యుమెంటరీ తీసే సమాజంపై దర్శకులకు నిజమైన ఆసక్తి ఉండాలని, తాము ఎందుకు ఈ చిత్రాన్ని తీస్తున్నారో అక్కడి ప్రజలకు స్పష్టంగా వివరించాలని సూచించారు.

డాక్యుమెంటరీ చలనచిత్ర నిర్మాణంపై అంతర్జాతీయ దృక్పథాన్ని వివరిస్తూ.. ఈ విభాగానికి ఫ్రాన్స్ అందిస్తున్న సంస్థాగత మద్దతును, ముఖ్యంగా సినిమా టికెట్ల ద్వారా వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని చిత్ర నిర్మాణానికి కేటాయించడం, థియేటర్లలో సినిమాలు ప్రదర్శించే కాలానికి ప్రత్యేక నిబంధనలు ఉండటం వంటి అంశాలను ప్రస్తావించారు. రాబోయే సంవత్సరాల్లో పారిస్‌లో భారతీయ డాక్యుమెంటరీ చిత్రాల ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. భారత్‌కు గొప్ప డాక్యుమెంటరీ చిత్ర నిర్మాణ సంప్రదాయం ఉందని కొనియాడారు.

కృత్రిమ మేధ వినియోగం పెరుగుతుండటంపై బెర్టుసెల్లి ఆందోళన వ్యక్తం చేశారు. సృజనాత్మకత, కాపీరైట్ హక్కులు, పర్యావరణంపై కృత్రిమ ప్రభావం గురించి ఆమె ప్రస్తావించారు. ముఖ్యంగా నీరు, విద్యుత్ వినియోగం పెరగడం వంటి సమస్యలను వివరించారు. ఏఐపై అతిగా ఆధారపడితే మానవ జ్ఞాపకశక్తి, స్వతంత్ర ఆలోచన, సహజమైన సృజనాత్మకత దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

డాక్యుమెంటరీ సినిమాల ప్రత్యేకతను వివరిస్తూ.. కృత్రిమ మేధ అనుకరించలేని వాస్తవ మానవ సంబంధాలలోని సహజ భావోద్వేగాలు, నిశ్శబ్దాలు, హావభావాలు, లోపాలను అది ఒడిసిపడుతుందని ఆమె అన్నారు.

నమ్మకం, నైతిక బాధ్యత, మానవ సంబంధాల అవగాహనతో కూడిన ప్రక్రియే డాక్యుమెంటరీ చిత్ర నిర్మాణమని ఈ సమావేశం ద్వారా స్పష్టమైంది. సమాజం దృష్టికి రాని వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావడంలో, అర్థవంతమైన మార్పును ప్రోత్సహించడంలో సినిమాలకు ఉన్న ప్రాధాన్యాన్ని కూడా ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

పోలియో రహిత సమాజమే లక్ష్యం!

ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలి

నీలం మధు ముదిరాజ్ పిలుపు

సంగారెడ్డి, నవంబర్ 23: (నేటినిజం ప్రతినిధి): చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించి, పోలియో రహిత సమాజాన్ని నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు.

ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు రెండు చుక్కల నోటి పోలియో టీకా వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అనంతరం నీలం మధు మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముఖ్యంగా చిన్నారులను వ్యాధుల నుంచి కాపాడేందుకు పలు ఆరోగ్య కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. పోలియో వంటి ప్రమాదకర వ్యాధులను పూర్తిగా నిర్మూలించాలంటే ప్రభుత్వ కృషితో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని పేర్కొన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఒక్క చిన్నారి కూడా టీకాకు దూరం కాకూడదని, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అర్హులైన పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పిల్లల ఆరోగ్యంపై నేడు చూపే శ్రద్ధే రేపటి సమాజానికి బలమైన పునాది అవుతుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం చేపడుతున్న ప్రజారోగ్య కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు గోపాల్, దస్తగిరి, నాయకులు అనిల్, శ్రీనివాస్, వైద్య సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పోలియో చుక్కలు తప్పనిసరి..

కొత్తాపూర్ చౌరస్తా పీహెచ్‌సీలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి, నవంబర్ 23:(నేటినిజం ప్రతినిధి): చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి రక్షించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, వారి ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడాలని కోరారు. సంగారెడ్డిలోని కొత్తాపూర్ చౌరస్తా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వద్ద నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమానికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లలితాదేవి బొకే అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శశాంక్ దేశ్‌పాండే 12వ వార్డు కౌన్సిలర్ పొన్న రాజేందర్ రెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, 11వ వార్డు కౌన్సిలర్ దశరథరెడ్డి, 32వ వార్డు కౌన్సిలర్ నవీన్, లాడే బాలు, హరీష్, మాణిక్ రెడ్డి, మాధవరెడ్డి, అశోక్, దామోదర్, మధు తదితరులు పాల్గొన్నారు.

యువత సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి..

వ్యాయామానికి ప్రాధాన్యమివ్వాలి.. ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

ప్రభుత్వ హామీల అమలులో జాప్యంపై గండ్ర విమర్శలు



మహబూబ్‌నగర్, నవంబర్ 23:యువత సెల్‌ఫోన్ల వినియోగాన్ని తగ్గించి శారీరక వ్యాయామానికి ప్రాధాన్యమివ్వాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సూచించారు. సోమవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ స్టేడియం, జయశంకర్ పార్కుల్లో ఉదయం వాకింగ్ చేస్తున్న ప్రజలను ఆయన పలకరించి, వారితో కలిసి నడిచారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ.. సంపూర్ణ ఆరోగ్యానికి నిత్య వ్యాయామం, వాకింగ్ ఎంతో అవసరమన్నారు. ప్రస్తుత యువత ఎక్కువ సమయం సెల్‌ఫోన్లకే కేటాయిస్తూ శారీరక శ్రమకు దూరమవుతోందని, ఆరోగ్య పరిరక్షణకు వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. సాగునీరు, విద్యుత్ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. రాజకీయ విమర్శలను పక్కనపెట్టి ప్రజా సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. రైతులు, సామాన్య ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి రామస్వామి నాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డి యువత, నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే కరెంట్ అఫైర్స్ పుస్తకాలను అందజేశారు. స్థానికులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటికన్నె అండర్ బ్రిడ్జి నిర్మాణంతో రైతులకు ఇక్కట్లు

200 ఎకరాల భూములకు దారి బంద్.. వై ఆకారంలో రహదారి నిర్మించాలని రైతుల ధర్నా



మహబూబ్‌నగర్, నవంబర్ 23: రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం రైతులకు ఇబ్బందులు తెచ్చిపెట్టింది. సుమారు 200 ఎకరాల వ్యవసాయ భూములకు వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. వై ఆకారంలో రహదారి నిర్మిస్తామని హామీ ఇచ్చి, ఒకవైపు మాత్రమే దారి ఏర్పాటు చేయడంపై నిరసన వ్యక్తం చేస్తూ సోమవారం రైల్వే గేటు వద్ద ధర్నా నిర్వహించారు.

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామంలోని రైల్వే గేటు నంబర్ 75 వద్ద గత ఏడాది నుంచి అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గేటుకు అవతల ఉన్న సుమారు 200 ఎకరాల వ్యవసాయ భూములకు వెళ్లేందుకు వై ఆకారంలో రహదారి ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. అందుకు అంగీకరించిన అధికారులు చివరకు ఒకవైపు మాత్రమే దారి కల్పించడంతో సమస్య ఏర్పడింది.

గతంలో కేసముద్రం పర్యటనకు వచ్చిన రైల్వే డీఆర్ఎంకు రైతులు వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ అధికారులు సమస్యను పరిశీలించి రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించినా పరిష్కారం లభించలేదు. దీంతో నల్లమాస సందీప్, పెద్దగొని వెంకన్న ఆధ్వర్యంలో రైతులు ధర్నాకు దిగారు.

వై ఆకారంలో రహదారి నిర్మించాలి

కేసముద్రం తహసీల్దార్ ఇంటికన్నె గ్రామాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలని రైతులు కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సుమారు 200 ఎకరాల భూములకు రాకపోకలు సాగించేలా వై ఆకారంలో రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నాలో బోళ్ల మల్లయ్య, కదిరి వెంకన్న, రాజులపాటి దేవేందర్, సుధాగాని రాము, గడ్డి సమ్మయ్య, వర్ధెల్లు సంపత్, చిలగొని రాజయ్య, నల్లమాస జనార్దన్ తదితర రైతులు పాల్గొన్నారు.

"ప్రతి క్షణం కొనసాగే ఆధ్యాత్మిక ప్రయాణమే బికమింగ్": 57వ ఇఫీలో దర్శకురాలు లీనా యాదవ్

న్యూఢిల్లీ, నవంబర్ 23: భావవ్యక్తీకరణకు ఉన్న అనేక సాధనాల్లో భాష కూడా ఒకటనీ, మానవ భావోద్వేగాలు భాషా సరిహద్దులను అధిగమించగలవనీ లదాఖీ నాన్-ఫీచర్ చిత్రం బికమింగ్ దర్శకురాలు లీనా యాదవ్ అన్నారు. గోవాలో జరుగుతున్న 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫీ) సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇండియన్ పనోరమా-2026 తొలుత ప్రదర్శించే నాన్-ఫీచర్ చిత్రంగా బికమింగ్ ఎంపికయింది. లదాఖ్ సాంస్కృతిక నేపథ్యం, సంప్రదాయాల గుండా సాగే ఆధ్యాత్మిక ప్రయాణాన్ని ఈ చిత్రం ఆవిష్కరిస్తుంది.

స్థానికంగా నివసించే, వృత్తిపరమైన అనుభవం లేని నటీనటులకు దర్శకత్వం వహించిన అనుభవాన్ని యాదవ్ గుర్తు చేసుకున్నారు. తాను ఎక్కువగా హిందీలోనే మాట్లాడాననీ, నటీనటుల్లో చాలామంది లదాఖీ భాష మాట్లాడేవారనీ, వారికి హిందీ అంతగా తెలియదనీ ఆమె చెప్పారు. భాషాపరమైన అడ్డంకి ఉన్నప్పటికీ, నటీనటులు తమ పాత్రల్లోని భావోద్వేగాలను అర్థం చేసుకుని, వాటిని వ్యక్తం చేయగలిగారు. ఇతరుల మాటలను శ్రద్ధగా వినడం, అర్థం చేసుకోవడం, మాటలకు అతీతమైన భావవ్యక్తీకరణ ఎంత ముఖ్యమో ఈ అనుభవం తనకు మరోసారి గుర్తుచేసిందని ఆమె పేర్కొన్నారు.

లీనా యాదవ్ రచించి, దర్శకత్వం వహించిన బికమింగ్ చిత్రం లదాఖ్‌కు చెందిన అగ్యల్ అనే బాలుడి చుట్టూ తిరుగుతుంది. ప్రకృతితో ఉన్న అసాధారణమైన అనుబంధం, గత జన్మకు సంబంధించినవిగా అనిపించే జ్ఞాపకాలు పురాతన లికిర్ మఠం వైపు అతడిని నడిపిస్తాయి. అక్కడ ఓ రింపోచేకు సంబంధించిన వస్తువులను గుర్తిస్తాడు. దీంతో ఈ బాలుడే ఆ ఆధ్యాత్మిక గురువు పునర్జన్మ అని సాధువులు విశ్వసించడం ప్రారంభిస్తారు. పునర్జన్మ, గుర్తింపు, విధి, గతానికి వర్తమానానికి మధ్య ఉన్న సంబంధం తదితర అంశాలను ఈ చిత్రం ఆవిష్కరిస్తుంది.

ఈ చిత్రాన్ని ఒక ఆధ్యాత్మిక అనుభూతిగా యాదవ్ అభివర్ణించారు. బికమింగ్ అనే ఆలోచన కేవలం ప్రధాన పాత్ర ప్రయాణానికే పరిమితం కాలేదని యాదవ్ వివరించారు. నిరంతరం పరిణామం చెందే మానవ జీవితానికి ఇది ప్రతీక అనీ, దానికి ఒక నిర్దిష్టమైన ముగింపు అంటూ ఉండదనీ ఆమె తెలియజేశారు. చిత్ర కథనంపై, విజువల్ భాషపై బౌద్ధ తత్వశాస్త్రం, లదాఖ్‌కే ప్రత్యేకమైన ప్రకృతి దృశ్యాల ప్రభావం ఎలా ఉందో కూడా ఆమె వివరించారు.

ప్రాజెక్టు ఆలోచన ప్రారంభమైన సందర్భాన్ని నిర్మాత, సినిమాటోగ్రాఫర్ అసీమ్ బజాజ్ గుర్తు చేసుకున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో కెమెరా పరికరాలను పరీక్షించే అవకాశం వచ్చినప్పుడు ఈ చిత్ర ఆలోచన మొదలైందని తెలిపారు. కేవలం ఆ పరికరాలకు ప్రచారం కల్పించడానికి బదులుగా, లదాఖ్‌లో ఒక లఘు చిత్రం నిర్మించాలని తాను ప్రతిపాదించినట్లు చెప్పారు. దీనికోసం బికమింగ్ అనే పేరునూ, బౌద్ధమత ప్రపంచమూ, లదాఖ్ ప్రాంతమూ అనే మూడు ప్రాథమిక అంశాలను తాను యాదవ్ ముందుంచానని తెలియజేశారు. ఆ ప్రాంతం, అక్కడ కలిసిన ప్రజల నుంచి పొందిన స్ఫూర్తితో క్రమంగా ఈ కథ రూపుదిద్దుకుందని ఆయన వివరించారు.

కార్తీక సోమవారం.. గూడెం గుట్టకు పోటెత్తిన భక్తజనం

శ్రీ సత్యనారాయణ స్వామి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు..

ఏర్పాట్లను పరిశీలించిన దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్

వరంగల్, నవంబర్ 23:కార్తీక మాసం సోమవారం కావడంతో మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని గూడెం గుట్ట శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా సమీపంలోని గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, రావిచెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి వ్రతాల్లో పాల్గొన్నారు. భక్తుల రద్దీతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లు, అన్నదానం, వాహనాల పార్కింగ్ వద్ద సౌకర్యాలు కల్పించారు. పోలీసులు బందోబస్తు నిర్వహిస్తూ రద్దీని క్రమబద్ధీకరించారు. ఆలయంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా చక్కటి ఏర్పాట్లు చేశారని భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

ఇదిలా ఉండగా, రానున్న కార్తీక పౌర్ణమి వేడుకల నేపథ్యంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.



పరమ పవిత్రం... కార్తీక పౌర్ణమి

కార్తీకమాసంలో వచ్చే పౌర్ణమి చాలా పవిత్రమైనది ఇది అత్యంత మహిమాన్వితమైనదని పురాణాలు చెబుతున్నాయి. ఈ మాసంలో ప్రతి దినమూ పవిత్ర మైనదే.. సోమవారాలు, రెండు ఏకాదశులు, శుద్ధ ద్వాదశి పౌర్ణమి దినాలు ఒకదాని కంటే మరొకటి అధిక ప్రభావంతమైనవి. నెలరోజులు చేసే కృత్యాల ఫలితం ఒక ఎత్తు, పౌర్ణమి నాటి కృత్యాల ఫలితం ఒక్కటీ ఒక ఎత్తు. అందువల్ల అనేక ప్రతాలు పూజలు, కృత్యాలకు, దైవారాధనకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పురాణాలు వివరిస్తున్నాయి. పౌర్ణమిరోజున దీపారా ధనకు విశేష ప్రాముఖ్య ముంది. శివ, విష్ణు దేవాలయాల్లో రెండింటా దీపాలు వెలిగిస్తారు. విష్ణు ఆలయాల్లో గోపురం మీదా, ధ్వజస్తంభం ఎదుట, తులసికోట దగ్గర, దేవుడి సన్నిధి లోనూ ప్రమిదల్లో, ఉసిరికాయలపై బియ్యప్పిండితో చేసిన ప్రమిదల్లో దీపాలు వెలిగించాలి. ఈ దీపాలను చక్కగా కుంకుమ, పూలతో అలంకరించుకొని వెలిగించాలి. శివాల యంలో ధ్వజస్తంభంపై నందాదీపంతో పేరుతో అఖండదీపాన్ని, ఆకాశదీపం పేరుతో ఎత్తైన ప్రదేశాల్లో భరణిల్లో (కుండలు, లోహపాత్రలతో తయారుచేసి, వేలాడదీస్తారు. అరటి దొన్నెల్లో దీపాలు వెలిగించి చెరువులు, నదులు వంటి జల వనరుల్లో విడిచి పెడతారు. ఇలా చేయడం వల్ల అష్టైశ్వర్యాలు కలగడంతో పాటు ఎంతో పుణ్యం వస్తుంది. వైజ్ఞానిక పరంగా ఆలోచిస్తే ఈ కార్తీక దీపాల వెలుగుల నుంచి వచ్చే వాయువుల వల్ల వాతావరణంలోని కాలుష్యం తగ్గిపోయి వాతావరణం శుద్ధి అవుతుంది. ఫలితంగా ఆరోగ్యం చేకూరుతుంది. కార్తీక పౌర్ణమి నుంచి ఆచరించే వ్రతాల్లో భక్తేశ్వర వ్రతం ఒకటి. ఇది స్త్రీలకు సౌభాగ్యం కలిగి స్తుంది. భక్తురాలి కోరికను మన్నించి వరాలిచ్చే వ్రతం అని దీనికి పేరు, ఇది ప్రాచుర్యంలోకి రావడానికి ఒక కథ ఉంది పాండ్యుడు, కుముద్వతి దంపతులు సంతానార్థం శివుని ఆరా ధించి ప్రత్యక్షం చేసుకున్నారు. వారు చేసిన ఆరాధనలోని చిన్న లోపం వల్ల వరం ఇవ్వదలచు కోలేదట శివుడు. అందుకే "అల్పాయుష్కుడు, అతి మేధావి అయిన కొడుకు కావాలా పూర్ణాయుష్కురాలు, విధవ అయిన కుమార్తె కావాలా?" అని అడిగితే.. కుమారుణ్ణే కోరుకున్నారా దంపతులు. శివుడి వరం తోటి ఆ దంపతులకి కుమారుడు పుట్టాడు. అయితే ఆ కుమారుడు పెరుగుతున్న కొలదీ ఆ తల్లిదండ్రుల్లో గుబులు పెరుగు తోంది. ఆ సమయంలో శివభక్తి పరాయణురాలైన అలకాపురి రాజకుమార్తెపై వారి దృష్టి పడింది. ఆమె పిలిస్తే శివుడు పలికే టంత భక్తి, శక్తి కలదని విన్నారా దంపతులు. ఆ పిల్లను తమ కోడలిగా చేసుకుంటే తమ బిడ్డను పూర్ణాయుష్కుడిగా మార్చే బాధ్యత ఆమె చూసుకుంటుందని ఆలోచించి అలాగే చేశాడు వివాహమైన కొన్నాళ్లకే భర్తకోసం యమభటులు వచ్చేసరికి అసలు విషయం తెలిసింది ఆ సాధ్వికి, తక్షణమే తన భక్తి ప్రభావంతో శివుడ్ని ప్రార్థించి ప్రత్యక్షం చేసుకుని భర్తను పూర్ణాయుష్కుడిగా మార్చుకునే వరం పొందిందని పురాణ కథనం .

ఈ పౌర్ణమికి త్రిపుర పూర్ణిమ అని మరోపేరు. తారకాసురుడి ముగ్గురు కుమారులు బ్రహ్మను మెప్పించి, ఎక్క డికైనా స్వేచ్ఛగా సంచరించ గలిగే మూడు నగరా లను వరంగా పొందారు. అలాగే



ఎవరివల్లా మరణం లేకుండా వరం కోరారు. అది సాధ్యం కాదన్నాడు బ్రహ్మ. అలాగైతే రథంకాని రథంపై, విల్లుకాని విల్లుతో, .. నారికాని నారి సారించి, బాణం కాని బాణం సంధించి, మూడు నగరాలూ ఒకే సరళరే ఖలోకి వచ్చాక ఒకే బాణంతో ముగ్గురునీ ఏక కాలంలో కొడితేనే మరణం సంభవించేలా వరం కోరారు. ఇవ్వక తప్పలేదు బ్రహ్మకు, ఆ వర బలంతో లోకాలన్నింటా కల్లోలం సృష్టించారు. వివిధ లోకవాసులు విసిగిపోయి బ్రహ్మకు మొర పెట్టు కున్నారు. వరం ఇచ్చింది తానే కాబట్టి ఏమీ చేయలేను.. మీరు విష్ణువు దగ్గరకు వెళ్ళండి అని చెప్పాడు. విష్ణువు కూడా తనకా శక్తిలేదని, వారిని వెంటబెట్టుకుని శివుడి దగ్గరకు వెళ్లాడు, దేవతలం దరూ సహకరిస్తే తానేపని చేయగల నన్నాడు శివుడు ఆ మాటతో భూమి రథం కాని రథంగా మారింది మేరు పర్వతం విల్లుకాని విల్లుగా, ఆదిశేషువు అల్లె తాడు కాని అల్లెతాడుగా, శ్రీ మహావిష్ణువు బాణం కానీ బాణంగా మారారు. వీరందరి సమాహార శక్తితో శివుడు త్రిపురాసు రులను సంహరించాడని, అందు వల్ల కార్తీక పౌర్ణమికి ఈ పేరు వచ్చిందని పురాణ కథనం..

కార్తీక పౌర్ణమిరోజు చేసే స్నానం, దీపా రాధన, ఉపవాసం వంటి అన్నింటి లోనూ ఆరోగ్య, ఆధ్యాత్మిక భావ నలు అంతర్లీనంగా ఉన్నాయి. ఈ మాసమంతా సూర్యోదయానికి ముందే తలస్నానం చేయడం వల్ల ఆరోగ్యం కలుగుతుంది. ప్రస్తుతకా లంలో ఉద్యోగాల బిలో కానీ ఇతర ఏ కారణం చేతనైనా రోజూ దేవుడ్ని పూజించి దీపారాధన చేసే సమయం లేనివారు, నిష్ఠను ఆచరించలేని వారు కార్తీక పౌర్ణమినాడు ఆచరిస్తే చాలు.. నెలంతా పూజ చేసిన ఫలితం కలుగు తుంది. ఈ రోజున స్త్రీల కొరకు ప్రత్యేకంగా ఉపవాసం చేయాలని శాస్త్రాలు చెబుతున్నాయి పగలంతా ఉపవాసం ఉండి, రాత్రి దీపారాధన చేసి, చలిమిడిని చంద్రుడికి నివేదించి పలహారంగా స్వీకరిం చాలి. ఇలా చేయడం వల్ల కడుపు చలువ అంటే బిడ్డలకు రక్ష కలుగుతుందని పెద్దలంటారు. ఆరోగ్యపరంగా చూస్తే ఇలా చేయడం వల్ల గర్భాశయ సమస్యలు దరిచేరవని ఆయుర్వేద శాస్త్ర కథనం. ఈ రోజు మరో ప్రత్యేకత ఏంటంటే.. శివాల యాల్లో జరిపే జ్వాలాతోరణం. కార్తీక పౌర్ణమిరోజు శివుడు త్రిపురాసురులను సంహరించి ఇంటికి వస్తాడు. విజయంతో తిరిగి వచ్చిన పరమశివుడికి దిష్టి తగలకుండా ఉండటం కోసం పార్వతీదేవి జ్వాలాతోరణోత్సవం నిర్వహించిందట. అదే వద్ధతిలో ఈ రోజున శివాలయాల్లో జ్వాలాతోరణోత్స వాన్ని జరుపు తుంటారు. కార్తీక పౌర్ణమి రోజున శివాలయానికి వెళ్లి దీపారాధన చేసి ఈ జ్వాలా తోరణోత్సవాన్ని చూడటం వల్ల సమస్త దోషాలు నశించి సకల శుభాలు చేకూరతాయట. ఇంకా ప్రాంతీయ, ఆచార వ్యవహారాల భేదంతో అనేక ప్రతాలు, పూజలు, నోములు చేస్తారీ రోజు, వాటిలో వృష ప్రతం, మహాఫలప్రతం, నానాఫలప్రతం, సౌభాగ్యప్రతం మనోరథ మూర్తిమాప్రతం, కృత్తికాప్రతం వంటివి ముఖ్యమైనవి. వీటితోపాటు లక్ష బిల్వార్చన, లక్షప్రదక్షిణ, లక్షవత్తులు, లక్షరుద్రం వంటి పూజలు చేస్తారు.

ప్రత్యేకతలు

దైవదర్శనం, దీపారాధన, దీపదానం, సాలగ్రామదానం, దీపోత్సవ నిర్వహణ ఈ రోజు విశేష శుభ ఫలితాలను అనుగ్ర హిస్తాయని కార్తీక పురాణంలో ఉంది. ఎవరి శక్తి సామర్థ్యం లను బట్టి హరిహరులను సేవించి వారి కరుణా కటాక్షాలు పొందాలి. వీరిని ఎంత నిష్టతో పూజిస్తే అంత శుభఫలితాలు ఉంటాయి.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైంది

ఈ ప్రభుత్వాన్ని సాగనంపుతాం
ఓట్ చోరీ కాదు.. ప్రజల మనసు దోచుకున్నాం
కుటుంబం, పదవుల కోసమే రాహుల్ ఆరాటం
ప్రజాస్వామ్యాన్ని నమ్ముకున్నాం.. 'సర్'ను అడ్డుపెట్టుకుని రాజకీయాలు
బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్



కరీంనగర్, నవంబర్ 23: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని, రానున్న రోజుల్లో బీజేపీ కార్యకర్తలు ఈ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించి సాగనంపుతారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్‌లో నిర్వహించిన మహా పాదయాత్రలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్‌లో కనిపిస్తున్న ప్రజాస్పందన, బీజేపీ కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే ప్రజలు బీజేపీకి అండగా నిలుస్తున్న విషయం స్పష్టమవుతోందన్నారు. కరీంనగర్ ప్రజల మధ్యకు ప్రజాస్వామ్య గొంతుకను బలంగా వినిపించేందుకే వచ్చామని తెలిపారు. ప్రతిపక్షాలు అరాచకాన్ని నమ్ముకుంటే, బీజేపీ ప్రజాస్వామ్యాన్ని నమ్ముకుందన్నారు. ఇటీవల విపక్షాలు తమ సర్వశక్తులూ ఒడ్డినా రాంజీలా మైదానంలో ఆశించిన స్థాయిలో ప్రజలను సమీకరించలేకపోయాయని విమర్శించారు. మరోవైపు దేశవ్యాప్తంగా 200కు పైగా ప్రాంతాల్లో బీజేపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో ప్రజలను సమీకరించి తమ బలాన్ని చాటారన్నారు.


రాహుల్ గాంధీ ఓట్ల చోరీ జరిగిందంటూ ఆరోపణలు చేస్తున్నారని, ప్రజల మద్దతు, ఓట్లు తమ పక్షాన ఉన్నాయని నితిన్ నబీన్ అన్నారు. ఓట్ల చోరీ రాజకీయాన్ని కాంగ్రెస్‌కే వదిలేస్తున్నామని వ్యాఖ్యానించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను అడ్డుపెట్టుకుని ఇండియా కూటమి నేతలు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగ ప్రతులను చేతిలో పట్టుకుని తిరిగే నాయకులకు రాజ్యాంగం విలువ తెలియదని, రాజ్యాంగం తమ చేతుల్లోనే కాకుండా గుండెల్లో, మనసుల్లో ఉందన్నారు. మరణించిన వారి పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగాలా... వేరే ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిన వారికి రెండు చోట్ల ఓటు హక్కు ఉండాలా? డూప్లికేట్ ఓట్లను తొలగించకూడదా... అని ప్రశ్నించారు. ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ స్థానం కల్పించడంతోపాటు అనర్హుల పేర్లను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు.

కాంగ్రెస్ పాలనలో ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని నితిన్ నబీన్ ఆరోపించారు. తమ కుటుంబం, పదవుల కోసం ప్రజాస్వామ్య వ్యవస్థలను దెబ్బతీసిన కాంగ్రెస్ నాయకులు నేడు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. రాహుల్ గాంధీ దేశంలో ఉన్నప్పుడు దేశ ప్రజలను, విదేశాలకు వెళ్లినప్పుడు భారతదేశ ప్రతిష్ఠను అవమానించేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. భారత ఆర్థిక వ్యవస్థపై కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నప్పటికీ, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందన్నారు.

ఢిల్లీ పెద్దల ఆశీర్వాదానికే సీఎం ప్రాధాన్యత

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సమస్యల కంటే ఢిల్లీ పెద్దల ఆశీర్వాదాల కోసమే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని నితిన్ నబీన్ ఆరోపించారు. 36 నెలల పాలన పూర్తికాకముందే 82 సార్లకు పైగా ఢిల్లీ పర్యటనలు చేశారని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు, యువతకు కాకుండా రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంలా పనిచేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ పేద ప్రజల కష్టార్జితాన్ని ఢిల్లీ పెద్దల కోసం వినియోగిస్తున్నారని విమర్శించారు. యువత, రైతులు, మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. గతంలో ఒక అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించిన తెలంగాణ ప్రజలకు అంతకంటే పెద్ద అవినీతి ప్రభుత్వం వస్తుందని తెలియలేదని, ఈ ప్రభుత్వానికి ప్రజలే తగిన సమాధానం చెబుతారని నితిన్ నబీన్ పేర్కొన్నారు.

రామాయంపేటలో ఆర్డీవో ఆఫీస్‌ను ప్రారంభించాలి : పద్మాదేవేందర్ రెడ్డి



మెదక్, నవంబర్ 23:మెదక్ జిల్లా రామాయంపేటలో రెవెన్యూ డివిజన్ కార్యాలయంకేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని వెంటనే కార్యాలయం ఏర్పాటు చేయాలని మాజీ డివ్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మెదక్ కలక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ నగేష్ కు రెవెన్యూ డివిజన్ కార్యాలయం వెంటనే ప్రారంభించాలని వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆమో మాట్లాడుతూ.. పాలన సౌలభ్యం కోసం నాడు కేసీఆర్ ఆర్డీవో ఆఫీస్‌ను ఏర్పాటు చేశారన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం దానిని రద్దు చయేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

'ఐలు నల్లగొండ 12వ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి'



నల్గొండ, నవంబర్ 23:ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) 12వ నల్లగొండ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఐలు జిల్లా కార్యదర్శి అనంతుల శంకరయ్య, నల్లగొండ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.సతీష్ కుమార్, బి.అశోక్ కుమార్ న్యాయవాదులకు పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండ బార్ అసోసియేషన్ హాల్‌లో ఐలు ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 28న నల్లగొండలోని యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించే ఐలు జిల్లా మహాసభలను న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా నల్లగొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.వసంత్ పటేల్ హాజరవుతున్నట్లు తెలిపారు.ఐలు యూనియన్ న్యాయవాదుల హక్కుల కోనం నమాజంలో జరుగుతున్న అన్యాయాలపై నిత్యం పోరాడుతున్న సంఘమన్నారు. ఈ మహాసభలలో న్యాయవాదుల సమస్యలపై చర్చించడం జరుగుతుందని, కావున సీనియర్ న్యాయవాదులు జూనియర్ న్యాయవాదులు న్యాయ శాఖ విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.స్వామిగౌడ్, సీనియర్ న్యాయవాదులు ఎన్.వి.రాఘవరావు, లెనిన్ బాబు, జి.జవహర్‌లాల్, నాగిరెడ్డి, ఎస్.ఆర్.కాగూర్, జి.లింగయ్య, టి.కిషోర్, డి.స్వామినాధ్, అప్రోజ్, భీమగాని గణేష్ శ్రీకాంత్, శంకర్ బాబు, వంశీకృష్ణ, రవీందర్‌రావు, బి.నాగేశ్ పాల్గొన్నారు.

చిత్తూరు మేయర్‌గా కఠారి హేమలత

ప్రమాణ స్వీకారం

డిప్యూటీ మేయర్‌గా 24వ వార్డు కార్పొరేటర్ ఏ. గోపీనాథ్ ఎన్నిక
నూతన పాలకపర్గం కొలువుదీరడంతో
నగరాభివృద్ధిపై ప్రజల్లో ఆశలు

చిత్తూరు, నవంబర్ 23:చిత్తూరు నగరపాలక సంస్థ నూతన మేయర్‌గా కఠారి హేమలత సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెతోపాటు నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో నగరపాలక సంస్థలో నూతన పాలకవర్గం కొలువుదీరింది. అనంతరం 24వ వార్డు కార్పొరేటర్ ఏ. గోపీనాథ్‌ను డిప్యూటీ మేయర్‌గా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు, పూతలపట్టు ఎమ్మెల్యే కె. మురళీమోహన్ హాజరయ్యారు. తొలుత కలెక్టర్ మేయర్ కఠారి హేమలతతో ప్రమాణ స్వీకారం చేయించగా, అనంతరం నూతన కార్పొరేటర్లతో ప్రమాణం చేయించారు. కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను ఎమ్మెల్యేలు నన్నానించి అభినందించారు.

ఈ సందర్భంగా మేయర్ కఠారి హేమలత మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులతో రెండోసారి మేయర్‌గా అవకాశం దక్కడం ఆనందంగా ఉందన్నారు. తన అత్తమామలు కఠారి అనురాధ, మోహన్, భర్త ప్రవీణ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ నగరాభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన నగర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మేయర్ పదవిని అధికారంగా కాకుండా బాధ్యతగా భావిస్తానని, నగరంలోని ప్రతి వార్డును స్మార్ట్ వార్డుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

ప్రజలకు విద్య, వైద్య సేవలను మరింత చేరువ చేయడంతోపాటు రహదారులు, మురుగునీటి కాలువలు, వీధి దీపాలు, ఇతర మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని చెప్పారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ కార్పొరేటర్లందరితో సమన్వయంతో పనిచేస్తానన్నారు. చిత్తూరు నగరపాలక సంస్థకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తానని, కూటమి ప్రభుత్వ సహకారంతో నగరాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

డిప్యూటీ మేయర్ ఏ. గోపీనాథ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో డిప్యూటీ మేయర్‌గా ఎన్నుకున్న కార్పొరేటర్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

నగరాభివృద్ధి కోసం మేయర్ కఠారి హేమలత, ఇతర కార్పొరేటర్లతో సమన్వయంతో పనిచేస్తానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు, ఎన్నికల ఇన్‌ఛార్జ్ పెంచల శ్రీకాంత్, ప్రాంతీయ సమన్వయకర్త దామర్చెల్ల సత్య, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్లు, సీనియర్ నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్, ఇతర ఎన్నికల అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.

-సమస్యల పరిష్కారానికే ప్రజావాణి
- ప్రజావాణికి 59 వినతులు.



సంగారెడ్డి, నవంబర్ 23(నేటి నిజం ప్రతినిధి)ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత మేరకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.కార్యక్రమానికి వచ్చిన అర్జీదారుల సమస్యలను కలెక్టర్, అదనపు కలెక్టర్లు స్వయంగా ఆలకించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు వినతులను పంపిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు సమగ్రంగా పరిశీలించి, సమస్యల సత్వర పరిష్కారం పై దృష్టి సారించాలని సూచించారు.

ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 59 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. డివిజన్ల వారీగా సంగారెడ్డి డివిజన్‌లో 16, నారాయణఖేడ్ డివిజన్‌లో 8, జహీరాబాద్ డివిజన్‌లో 1 వినతి అందగా, కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 34 వినతులు అందాయనీ ,అందోల్ డివిజన్‌లో ఎలాంటి వినతులు అందలేదని అధికారులు వెల్లడించారు.ప్రజావాణిలో రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్య, పోలీస్, నీటిపారుదల, పౌరసరఫరాలు, విద్యుత్, వైనార్టీ సంక్షేమం, సాంఘిక సంక్షేమం, జిల్లా ఇంటర్మీడియట్ విద్య, లీడ్ బ్యాంక్, ఎస్సీ సంక్షేమం, డీఆర్‌డీఏ, గృహనిర్మాణం, రిజిస్ట్రేషన్లు, మహిళా, శిశు , వికలాంగుల సంక్షేమం, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.